ॐ

కు(సు)మతీ శతకము



కం. బెల్లమును జీలకర్రను
యల్లుని కాకు నతికి శిర మందుంచ నగున్
పెళ్ళి, పిదప వరుకున్ రా
జిల్లెడి బట్టతల రాదె, చెప్పుము కు(సు)మతీ.

రచన: మద్దాలి వేంకట సత్య రంగనాథం

ॐ

కు(సు)మతీ శతకము

(ఉచిత ఈ-బుక్)

రచన:

మద్దాలి వేంకట సత్య రంగనాధం

కు(సు)మతీ శతకము

రచన: మద్దాలి వేంకట సత్య రంగనాధం

Ku(Su)mati Shatakamu (Free E-Book)

Author: M. V. S. Ranganadham

ISBN: 978-93-5937-062-0

ప్రచురణ (Publishing): 17 – 06 – 2026

Contact details of author:

M. V. S. Ranganadham

H. No. 5-12-78/46,

Laxmipuri Colony Phase – 2,

Sainikpuri, Hyderabad – 500 094.

Telangana State.

Mob: +91 9818878155

E-Mail: mvsranganadham@hotmail.com

అంకితం

నన్ను పెంచి పెద్దఁజేసిన మా పిన్ని
శ్రీమతి కృత్తివెంటి శ్రీలక్ష్మి గారి దివ్యస్మృతికి



(జీవన కాలము: 1943 - 2005)

కం. సీతను తలపించు గుణము
చేతల నిర్వహణ లందు చేదో డగుచున్
యూతము బలహీనుల కిడి
మాతను మరపించు నట్టి మగువగ నిలిచెన్.

కం. వ్రాతలు ముత్యంబులు పలు
యాతనలు భరించుటను సహనశీలి యనస్
జ్యోతి తిమిరమును తఱిమెడి
భాతిని చింతలనుఁ బాపి పర్వెను పల్లెస్.

కం. రూపమ్మున శ్రీలక్ష్మియె
వ్యాపకముగ హోమియోను పైద్యముఁ జేసెస్
దీపకమై వెలుగొందెను
జ్ఞాపకమై మిగిలె మానసమ్ముల యందుస్.

కం. శ్రీలక్ష్మి పెంపకంబున
బాలునిగాఁ గఱచి తెన్నో బడి కెళ్ళకనే
కాలముచేసిన పిన్నీ
బాలిమ స్మృతు లందు నిన్ను పరిపరి తలతుస్.

కం. జన్నము వలె శిక్షణ నిడ
యెన్నో తలపులను చేర్చి యీ శతకమునే
యన్నిట ప్రేరణ యగు నా
పిన్నమ్మకు యంకిత మొసవెద సద్భక్తిస్.

సభక్తికంగా నీ,



ముందు మాట

క్రీ.శ. 13వ శతాబ్దానికి చెందిన బద్దెన కవి రచించినది అని చెప్పబడుతున్న సుమతీ శతకము తెలుగు నాట చాలా మందికి సుపరిచితమే. అంతర్జాలంలో (Internet) దొరికిన సుమతీ శతకంలో 100 కందపద్యాలు ఉన్నాయి. నా చిన్నతనంలో పిల్లలకు సుమతీ శతకంలోని పద్యాలు కొన్నైనా కంఠతా వచ్చేవి. ఉదాహరణకి "అప్పిచ్చు వాడు వైద్యుడు, ...", "తన కోపమే తన శత్రువు, ...", "అక్కరకు రాని చుట్టము, ..", "బలవంతుడ నాకేమని, ...", "కనకపు సింహాసనమున, ...", "ఎప్పుడు సంపదలు గలిగిన, ..." లాంటి పద్యాలు చాలా తరాల పిన్నలకు పెద్దలకు ఎప్పుడూ నోటిలో నానేవి.

13వ శతాబ్దం నుండి ఇప్పటి వరకు సుమతీశతకం పద్యాలు ప్రజాదరణ పొందడానికి కారణం వాటిలో ఉపయోగించిన సరళమైన వ్యవహార భాష, చెప్పిన విషయాలలోని సామాజిక స్పృహ. ఆ కాలంలో బద్దెన కవి చెప్పిన పద్యసూక్తులు ఇప్పటికీ చాలా వరకు వర్తించినా కొన్ని మాత్రం కాలానుగుణంగా మార్చుకోదగ్గవి. అప్పటి పద్యాలలోని సార్వజనీనత అనే లక్షణాన్ని కొనసాగిస్తూనే, ఇప్పటి పరిస్థితులకి తగ్గట్లుగా వ్రాసే ప్రయత్నం ఈ శతకంలో చేయబడింది. కొన్ని ప్రసిద్ధమైన పద్యాలు పైకి అలాగే ధ్వనించేటట్లుగా వ్రాయబడ్డాయి.

"సుమతీ" అన్న సంబోధనాత్మక మకుటము స్త్రీపురుషులు ఇరువురికి చెబుతున్నట్లుగా ఉంటుంది. వేరే ఎవరో కవులు "కుమతీ శతకము" వ్రాసినట్లుగా

కూడా చదివాను. సూక్తులు మంచి బుద్ధి కలవాళ్ళకేనా, చెడ్డ బుద్ధి కలవాళ్ళకి చెబితే తప్పా అని వాదిస్తే, రెంటిలో ఏదైనా మకుటంగా ఉండవచ్చు అని అనిపిస్తుంది. అందుకనే, ఈ శతకానికి "కు(సు)మతీ శతకము" అన్న పేరు పెట్టడం జరిగింది. కుమతి అంటే చెడు బుద్ధి కలవాడు (కలది) అనీ, సుమతి అంటే మంచి బుద్ధి కలవాడు (కలది) అని అర్థం. అంటే, చెడు (మంచి) బుద్ధి కలవాడా (దానా)! అని సంబోధించడం అన్న మాట. పాఠకులలో ఎవరికి నచ్చినది వారు తీసుకోవచ్చు.

ఒక శతకంలో ఎన్ని పద్యాలు ఉండాలి అంటే కనీసం వంద పద్యాలు ఉండాలి, మొత్తం పద్యాలు వందకు దగ్గరగా ఉండాలి అని అదివరకటి శతకసాహిత్యం సూచిస్తోంది. ఈ శతకంలో 117 పద్యాలు (10-70 పేజీలలో చూడండి) ఉన్నాయి. అసలు ఒక శతకంలో ఏముండాలి అని తరువాతి ప్రశ్న వేస్తే ఏమైనా ఉండచ్చు అన్న సమాధానం వస్తుంది. అంటే, ఏమనిపిస్తే అది చెప్పవచ్చు, వినే వాళ్ళు ఉంటే. దీన్ని ఆత్మాశ్రయ కవిత్వం అన్నారు పెద్దలు. అనుకరణలు, అనుసరణలు, అనువాదాలు ఎక్కువగా ఉన్న సాహిత్య రచనల నుంచి కొంచెం ప్రక్కకు జరిగి, వివిధ అంశాల మీద స్వతంత్రంగా తమ అభిప్రాయాన్ని సూటిగానో, పరోక్షంగానో, వ్యంగ్యంగానో, ఇంకే విధంగానో పద్య రూపంలో చెప్పడానికి శతకమైతే అవకాశం (opportunity) పరిధి (scope) ఎక్కువ. అయితే, శతకంలోని అన్ని పద్యాలు ఒకే ఛందస్సులో, ఒకే మకుటంతో వ్రాయడం సంప్రదాయం. సుమతీ శతకంలో లాగానే ఈ శతకంలో కూడా అన్నీ కంద పద్యాలే. అయితే తప్పో రైటో, భావాన్ని నాలుగు పాదాలలో కుదించడం ఒక్కోసారి కుదరక, ఒకటీ అరా కంద పద్య మాలికలు కూడా వ్రాయడం జరిగింది.

భాష విషయంలో కూడా శతకం అనే సరికి కొన్ని వెసులుబాట్లు, కొన్ని స్వతంత్ర పోకడలు, కొంత ఆత్మాశ్రయ తత్వం కనిపిస్తాయి. "నా విన్నవి కన్నవి విన్నవించగా

మాటలకై వెదుకాడగబోతె, అవి, పుంఖానుపుంఖంగా శ్మశానాలవంటి నిఘంటువుల దాటి, వ్యాకరణాల సంకెళ్ళు విడిచి, ఛందస్సుల సర్పపరిష్వంగం వదలి, వడిగా, వడివడిగా వెలువడినై, పరుగిడినై ..." అన్న శ్రీశ్రీగారి మాటలు కొంత వరకు శతకాల విషయంలో కూడా వర్తిస్తాయి. వ్యవహార భాష, ఇతర భాషా పదాలు ప్రయోగించడానికి, భావం సమర్థవంతంగా వ్యక్తీకరించే క్రమంలో అక్కడక్కడా వ్యాకరణ దోషాలు వచ్చినా లెక్కచేయకుండా ఉండడానికి, శతకాల్లో ఎక్కువ స్వతంత్రం తీసుకోవడం కద్దు.

తెలుగులో ఇప్పటికే చాలా శతకాలు ఉన్నాయి కదా, మళ్ళీ ఇంకోటి ఎందుకు అన్న ప్రశ్న ఎలాంటిదంటే, దేశంలో జనాభా ఇప్పటికే ఎక్కువగా ఉంది కదా నువ్వు ఇప్పుడు పెళ్ళి చేసుకుని సంతానాన్ని కనాలా అన్నట్లు ఉంటుంది.

కం. శతకములు పెక్కు లున్నను
హితవాక్యము చెప్పు టందు యెనలేని తమిన్
మతి కింపగు వచనమ్ములు
శ్రుతపఱచెద మరల నిపుడు సుద్దులఁ వోలెన్.

(పెక్కులు = అనేకము, హిత = మేలుచేయునది, వాక్యము = మాట, ఎనలేని = అసమానమైన, తమి = కుతూహలము, మతి = బుద్ధి, ఇంపు = ఇష్టము, వచనము = మాట, శ్రుతపఱచు = వినిపించు, సుద్దులు = మంచిమాటలు, వోలె = వలె)

అంటే, శతకాలు అనేకం ఉన్నా కూడా మేలుచేసే మాటలు చెప్పడంలో ఉన్న అసమానమైన కుతూహలంతో బుద్ధికి ఇష్టమైన మాటలు మళ్ళీ ఇప్పుడు సుద్దుల లాగా వినిపిస్తాను.

శతకం వ్రాయడంలోని సాధకబాధకాలు, ఈ ఒక్క శతకంతోనే నాకు అర్థం అయ్యాయి. కావ్యాలలో వస్త్వైక్యము, అంటే ఒకే వస్తువు (subject) ఉండాలని నిర్దేశించడం ఎంత మంచి గుణమో, శతకం వ్రాసేటప్పుడు ఒక వస్తువు మీద కాకుండా చెప్పినది చెప్పకుండా కనీసం వంద భావాలు చెప్పాల్సి వచ్చినప్పుడు కలిగే గాబరా చూస్తే అర్థం అవుతుంది. ఆ భావాలని ఏ వరసలో పెట్టాలి అన్నది మరో అగ్నిపరీక్ష. మొత్తానికి శతకం అయిందనిపిస్తే, ఇంకా చెప్పాల్సినవి చాలా ఉండిపోయాయే అన్న అసంతృప్తి మిగులుతుంది. ఈ కష్టాల, గందరగోళాల మధ్య ఈ శతకం పూర్తిచేశాను.

ఇక ఈ శతకంలో నేను చెప్పిన విషయాలు నేను చిన్నప్పటి నుండి విన్నవీ, కన్నవీ, గమనించినవీ, తెలుసుకున్నవీ, చదివినవీ ఇత్యాదయః. వాటిల్లో చాలా వరకు అందరికీ తెలిసిన విషయాలే. మీరు ఈ శతకం చదివేటప్పుడు, కొన్ని విషయాలు క్రొత్తగా చెప్పాలనుకున్న నా తపన కనిపిస్తుంది. సంప్రదాయాన్ని అనుసరించి శ్రీకారంతో మొదలు పెట్టబడిన ఈ శతకంలో, స్థూలంగా చెప్పాలంటే, రాజకీయాలకి, పౌరాణిక ఇతివృత్తాలకి, సామాజిక సమస్యలకి సంబంధించిన విషయాలు మానవుని ఉనికి, ప్రవర్తన, విచక్షణలను ఉద్దేశించి చెప్పబడ్డాయి. చెప్పాల్సినవి ఇంకా చాలా ఉన్నా, మళ్ళీ ఎప్పుడైనా అవకాశం వస్తే ఇంకోసారి చెబుదాం, ఇప్పటికే చాలా చెప్పాం అని ఇంతటితో చాలిస్తున్నాను. ఈ శతకంలో వ్యక్తపరచిన కొన్ని అభిప్రాయాలు అలోచనలను రేకెత్తించేవిగా, ఇంకా చెప్పాలంటే కొంతన్నా రెచ్చగొట్టేవిగాఁ గనక ఉంటే, నా ప్రయత్నం సఫలం అయ్యింది అనుకుంటాను.

ఈ శతకంలోని భావపరంపరకు ఆధారభూతమైనది చిన్నప్పటి నుండి నాకు లభించిన వాత్సల్యభరితమైన శిక్షణ. ఆ శిక్షణే నా అలోచనా సరళిని అడుగడుగునా తీర్చిదిద్దింది. నాకు సమభావం అర్థం అయ్యేటట్లుగా చేసింది. అందుకు కారణమైన వాళ్ళలో అతి ముఖ్యురాలైన మా పిన్ని కీ.శే. శ్రీమతి కృత్తివెంటి శ్రీలక్ష్మి గారి దివ్యస్మృతికి ఈ నా మొదటి శతకాన్ని సభక్తికంగా అంకితం ఇస్తున్నాను (3-4 పేజీలలో వివరాలు చూడండి).

చదవడానికి ఎక్కువ సౌలభ్యమని ఎక్కువ మందికి అందించడానికి వీలవుతుందనీ ఈ శతకాన్ని లఘుటీకావ్యాఖ్యాన సహితముగా ఉచిత ఈ-బుక్ (free E-Book) రూపంలో విడుదల చేస్తున్నాను. నా గురించి క్లుప్తంగా ఈ ఈ-బుక్ ఆఖరి పుటలో (శతకం పేజీల తరువాత) ఇచ్చాను. ఇది నా ఏడవ ఈ-బుక్. ఈ చిన్ని పొత్తములో దోషాలు గానీ నచ్చని విషయాలు గానీ ఉంటే పాఠకులు నాకు తప్పక తెలియఁజెయ్యాలని మనవి.

సైనిక్ పురి, హైదరాబాదు, భవదీయుడు,

ది: 17 - 06 - 2026. మద్దాలి వేంకట సత్య రంగనాథం

ॐ

కు(సు)మతీ శతకము

కం. 'శ్రీరామ'ను తొలి పదముగ
కీరములకు నేర్పునట్టి గేస్తులు తగ్గన్
దూఱుటయే నైజ మనెడు
పౌరులు నాయకులుఁ గారె ప్రభుతను కు(సు)మతీ. 1

(కీరము = చిలుక, గేస్తు = గృహస్తుడు, దూఱు = నిందించు, నైజము = స్వాభావికము, ప్రభుత = పరిపాలనా వ్యవస్థ)

'శ్రీరామ'ను తొలి మాటగా చిలుకలకు నేర్పే గృహస్తులు తగ్గిపోగా, తిట్టే స్వభావ మున్న పౌరులు ప్రభుత్వ వ్యవస్థలో నాయకులు కారా!

కం. పెక్కురు తన నడ్డుకొనిన
దక్కవు ప్రాణంబు లనిన ధైర్యము విడకన్
స్రుక్కక ధర్మము కొరకై
యొక్కఁడుగా పోరువాడె యోధుఁడు కు(సు)మతీ. 2

(పెక్కురు = చాలమంది, అడ్డుకొను = అడ్డగించు, దక్కు = మిగులు, విడు = వదలు, స్రుక్కు = వెనుదీయు, పోరు = యుద్ధముచేయు, యోధుఁడు = వీరుఁడు)

చాలమంది తనని అడ్డగించినా, ప్రాణాలు మిగలవని అన్నా, ధైర్యము వీడక, వెనుదీయక, ధర్మం కోసం ఒక్కడుగా యుద్ధము చేసే వాడే వీరుఁడు.

కం. తిమ్మిని బమ్మిని చేసిరి
దొమ్మీలను ప్రోత్సహించి దొరలై వెలుగస్
యిమ్మనుజేశ్వరు లధములు
నమ్మిన నట్టేట ముంచు నరకళ్ళనుచున్
యిమ్ముగ పలుకుచునే దా
స్యమ్ము సలుపుటే కపటుల సరళిర కు(సు)మతీ. 3

(తిమ్మినిబమ్మినిచేయు = క్రిందిది మీదికి మీదిది క్రిందికి చేసే వ్యవహారాలలో అతిదక్షత చూపు, దొమ్మీ = గుంపు దౌర్జన్యం, దొర = గొప్పవాడు, వెలుగు = వాసికెక్కు, మనుజేశ్వరుడు = పాలకుడు, అధముడు = నీచుడు, నట్టేరు = నదీమధ్యము, నరకడు = దుష్టుడు, ఇమ్ము = ఇంపు, దాస్యము = ఊడిగము, సలుపు = చేయు, కపటుడు = మోసగాడు, సరళి = వైఖరి)

దొరలుగా చలామణీ అవడానికి తిమ్మినిబమ్మిని చేసి, దొమ్మీలను ప్రోత్సహించిన ఈ పాలకులు నీచులు, నమ్మితే నట్టేట ముంచే దుష్టులు అని ఇంపుగా పలుకుతూనే దాస్యం చెయ్యడం మోసగాళ్ళ వైఖరి.

కం. కనకపు సింహాసనమును
శునకము వలె కాపుఁ గాయు సుజనులు యున్నన్
తనరారును విశ్వాసము
వెనుకటి దుర్గుణముల కది విరుగుడు కు(సు)మతీ. 4

(కనకము = బంగారము, సింహాసనము = రాజపీఠము, శునకము = కుక్క, కాపుఁ గాయు = కాపలా ఉండుట, సుజనుడు = ఉత్తముడు, తనరారు = ఎక్కువ అగు, విశ్వాసము = నమ్మకము, దుర్గుణము = చెడుబుద్ధి, విరుగుడు = విరుచునది)

కనకపు సింహాసనమున శునకాన్ని కూర్చోబెడితే వెనుకటి గుణమేల మానుతుంది అన్నారు. ఈ పద్యంలో అలా కాకుండా కుక్కల వలె విశ్వాసం ఉన్న వాళ్ళు కావాలని చెప్పబడింది.

బంగారపు రాజపీఠాన్ని కుక్క లాగా కాపలా కాసే ఉత్తములు ఉంటే విశ్వాసము (కుక్కలలో కనిపించే సహజ గుణమైనది) పెరుగుతుంది. వెనుకటి చెడ్డ గుణాలకి అది విరుగుడు.

కం. పదవిఁ గలప్పటి గర్వము
పదవిని పోఁగొట్టుకొనగ భాసిల్లదుగా
చెదరని సమతా వాదమె
తుదివరకును నాయకులకు తోడగు కు(సు)మతీ. 5

(భాసిల్లు = శోభిల్లు, చెదరు = చలించు, సమతా వాదము = సమానత్వం (egalitarianism), తుది = చివర)

పదవి ఉన్నప్పటి గర్వం పదవిని పోగొట్టుకోగానే శోభిల్లదుగా. సడలని సమతా వాదమే చివరి వరకు నాయకులకు తోడుగా ఉంటుంది.

కం. చట్టముల కింక మేమే
చుట్టముల మటంచు వదరుచు యొలసి దేనిస్
బట్టిన బంగార మనుచు
మిట్టిపడ, విడువక శిక్ష మేకొను, కు(సు)మతీ. 6

(చట్టము = శాసనము, చుట్టము = బంధువు, వదరు = ఉపయోగము లేని మాట లాడు, ఒలయు = కోరు, మిట్టిపడు = మిడిసిపడు, విడువక = తప్పక, శిక్ష = దండన, మేకొను = ప్రాప్తించు)

చట్టాలకి ఇంక మేమే చుట్టాల మంటూ ఉపయోగము లేని మాట లాడుతూ కోరి దేన్ని పట్టినా బంగారం అంటూ మిడిసిపడితే తప్పకుండా దండన ప్రాప్తిస్తుంది.

కం. ఏడు తరములకు సరిపడ
కూడె కలిమి యన్న తృప్తి కొఱతపడగ రా
పాడుచు జనులను వెంప
ర్లాడుట లంచముల కొరకు యాబయె కు(సు)మతీ. 7

(తరము = జీవితకాలము, కూడు = చేరు, కలిమి = సంపద, కొఱతపడు = లోపించు, రాపాడు = వేధించు, వెంపర్లాడు = ఆరాటపడు, లంచము = అక్రమధన ప్రదానము, ఆబ = అత్యాశ)

ఏడు తరాలకి సరిపడ సంపద కూడింది అన్న తృప్తి లోపించగా, ప్రజలను వేధిస్తూ లంచాలకి ఆరాటపడటం అత్యాశయే.

కం. అనువంశిక రాజరికము
మన కొద్దని౯ పోర, వచ్చె మన దేశమునన్
ఘనమైన ప్రజాస్వామ్యము,
వెనుకటి వలె నదియు మార వెగటయె, కు(సు)మతీ. 8

(అనువంశికము = వంశపారంపర్యము, రాజరికము = రాజులు పరిపాలించే వారసత్వ పాలనా విధానం, పోరు = కలహించు, ఘనము = గొప్ప, ప్రజాస్వామ్యము = ప్రజలే పాలకులై దేశమును పాలించుకొను పద్ధతి, వెగటు = అసహ్యం)

చాలా కాలం సాగిన పోరాటాల ఫలితంగా వంశపారంపర్య పాలన ఉన్న రాజరికం పోయి ప్రజాస్వామ్యం వచ్చింది. మారిన వ్యవస్థలో కూడా నాయకులు, పదవులు చేపట్టేవారు కొన్ని కుటుంబాలకే ఎక్కువగా పరిమితం అవ్వడం వల్ల, అది వరకు ఒక ప్రదేశంలో ఒక కుటుంబానికే అంకితమయిన వంశపారంపర్య పాలన, ఇప్పుడు కొన్ని కుటుంబాలకు ధారాదత్తం చేసినట్లయింది. అదే ఈ పద్యంలోని భావన.

రాజరికము వంశపారంపర్యము, మనకు వద్దు అని పోట్లాడగా మన దేశంలో గొప్ప ప్రజాస్వామ్యం వచ్చింది. అది కూడా వెనకటి లాగా మారగా అసహ్యం అనిపించింది.

కం. మతమౌఢ్యముఁ గల వారని
సుతరా మిట రాఁదగ రని సూత్రించిన శం
కితు లొకటై దుర్మతులకు
మతరహితులని ప్రభుత నిడ మానమె కు(సు)మతీ. 9

(మౌఢ్యము = అజ్ఞానము, సుతరాము = బొత్తిగా, సూత్రించు = సూత్రం చెప్పు, శంకితుడు = సందేహము గలవాడు, దుర్మతి = దుర్బుద్ధికలవాడు, రహితుడు = విహీనుడైనవాడు, ఇడు = ఇచ్చు, మానము = గౌరవము)

మతమౌఢ్యము ఉన్న వాళ్ళని బొత్తిగా ఇక్కడకు రాదగ్గ వాళ్ళు కాదని సూత్రాలు చెప్పిన శంకితులు ఒకటై మతరహితులని (secular) చెప్పి దుర్బుద్ధి కలవారికి ప్రభుత్వం అప్పజెప్పడం గౌరవమా?

కం. అధికార మదము హెచ్చిన
బధిరత్వము కూడ పెరుగు వద్దని యన్నన్,
క్షుధ పెరుగగ జిత్తు లనిన
యధరముపై నవ్వు పులుము టబ్బును కు(సు)మతీ. 10

(మదము = గర్వము, బధిరత్వము = చెవుడు, క్షుధ = ఆకలి, జిత్తు = మోసము, అధరము = పెదవి, పులుము = అలదు, అబ్బు = అలవడు)

అధికార గర్వము ఎక్కువైతే వద్దని చెప్పినా చెవుడు కూడా ఎక్కువౌతుంది. మోసాలంటే ఆకలి పెరుగగా, పెదవిపై నవ్వు పులుముకోవడం అలవాటవుతుంది.

కం. వర్తక సంఘము లేర్పడి
వర్తించిరి సేనఁ గూర్చి పాలకుల వలెన్,
కర్తవ్యము లట్లు తొలుత
వర్తిల్లగ దేశ మందు, వాటినిఁ గనియే
వర్తక వైదేశికు లయె
హర్తలు యవనీపతులుగ నంతట, కు(సు)మతీ. 11

(వర్తించు = వ్యవహరించు, కూర్చు = సిద్ధమొనరించు, పాలకుడు = రాజు, కర్తవ్యము = చేయఁదగినది, తొలుత = మొదట, వర్తిల్లు = ఉండు, కను = చూచు, వర్తకుఁడు = వ్యాపారి, వైదేశికుడు = పరదేశీయుఁడు, హర్త = దొంగ, అవనీపతి = రాజు, అంతట = అనంతరము)

ప్రాచీన భారతదేశంలో గిల్డులు (Guilds) అనే వర్తక సంఘాలు ఉండేవి. వీటినే శ్రేణులు, గణాలు అని కూడా అనేవారు. ఆ వర్తక సంఘాలు సైన్యాన్ని సమకూర్చుకొని దేశంలో సామంతరాజుల లాగా వ్యవహరించేవారు. మొదట్లో ఆ విధంగా వాళ్ళ కర్తవ్యాలు ఉండగా, వాటిని చూసే విదేశీవ్యాపారులు ఆ తరువాత దొంగలుగా రాజులుగా అయ్యారు.

అంటే, మొదట్లో వ్యాపారం కోసం అని వచ్చి కాలక్రమేణా రాజ్యాధికారం చేజిక్కించుకున్న బ్రిటీషువారు, ఇతర విదేశీ వ్యాపారులు, ఆ సూత్రం మనవాళ్ళ దగ్గర నుంచే నేర్చుకున్నారన్న మాట.

కం. ఆడది మెచ్చిన దందము,
వీడక రణ మందు నిలుచు వీరుండే వ
జ్రీఁడగు, ప్రత్యర్థి పొగడు
వాడే నాయకు డనబడు, వసుధను కు(సు)మతీ. 12

(వీడు = వదలు, వజ్రీఁడు = యోధుఁడు, ప్రత్యర్థి = ప్రతికూలుఁడు, పొగడు = మెచ్చుకొను, వసుధ = భూమి)

ఆడది మెచ్చినదే అందము. యుద్ధరంగాన్ని వదలకుండా నిలిచే వీరుడే యోధుడవుతాడు. ఈ లోకంలో ప్రత్యర్థి మెచ్చుకునే వాడే నిజమైన నాయకు డనబడతాడు. అలాంటి నాయకుల గురించి, ఇప్పటి సంగతి ఏమో గానీ, అది వరకు వినే వాళ్ళం. ఉదాహరణకి, ఎన్నికలలో ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం గారిని, తెన్నేటి విశ్వనాథం గారిని వాళ్ళ ప్రత్యర్థులు కూడా చాలా గౌరవించే వారని విన్నాను.

కం. ఘోటకపు బ్రహ్మచర్యము
నోటుకు యోటన్న మాట నుడువము యనుటల్
వాటా యడగని పొత్తులు
నాటకమని బూటకమని నమ్ముము కు(సు)మతీ. 13

(ఘోటకపు బ్రహ్మచర్యము = గుఱ్ఱం పాటించే బ్రహ్మచర్యము [అంటే, బ్రహ్మచర్యము పేరుకే కాని నిజంగా కాదని భావం], నుడువు = చెప్పు, వాటా = భాగము, పొత్తు = వ్యాపారము, నాటకము = కపటోపాయము, బూటకము = మాయ)

ఒక్కోసారి యమనియమాలతో బ్రహ్మచర్య దీక్ష పాటించేవారిని గురించి చెప్పడానికి "ఘోటక బ్రహ్మచర్యం" అన్న పదం తెలియక వాడుతూ ఉంటాం. జీవితాంతం బ్రహ్మచారిగా ఉన్నప్పటికీ, అంతర్గతంగా గుర్రం వంటి చంచలమైన మనస్తత్వం లేదా కామవాంఛలు కలిగిన వారిని

వర్ణించడానికి ఉపయోగించే పదం ఘోటక బ్రహ్మచర్యం. అంటే, నకిలీ (pseudo) బ్రహ్మచర్యాన్ని ఘోటక బ్రహ్మచర్యం అంటారు. ఈ పద్యం ఇలాంటి మాయమాటల గురించి చెబుతోంది.

ఘోటకపు బ్రహ్మచర్యం అనడం, నోటుకు ఓటు అన్న మాట అనం అని చెప్పడం, భాగం అడగని వ్యాపారాలు, మాయ, మోసం అని నమ్ము.

కం. ఎల్లయ మెరుగని మల్లయ
నొల్లక యెన్నికల లోన యోట్ల నతడికిన్
జల్లి గెలిపించ నేమగు
ముల్లును ముల్లుఁ గొని తీయు మోస్తరె కు(సు)మతీ. 14

(మెరుగు = నయం, ఒల్లు = ఇష్టపడు, జల్లు = కురిపించు, మోస్తరు = పోలిక)

ఐదేళ్ళకి ఒకసారి వచ్చే ఎన్నికలలో ఓటర్లకి ఎక్కువగా ఎంచుకోవడానికి ఉండదు. ఎప్పుడూ ఇద్దరు ప్రధాన ప్రత్యర్థుల మధ్యే పోటీ ఉంటుంది. ఒకసారి ఒకళ్ళు గెలిస్తే మలిసారి రెండవ వ్యక్తి గెలవడం జరుగుతుంది. ఓటర్ల దృష్టిలో ఏ రాయి అయితే నేమిటి పళ్ళూడ కొట్టుకోవడానికి అన్నట్లు ఉంటుంది. ఈ పద్యం అదే సూచిస్తోంది.

మల్లయను ఇష్టపడక ఎల్లయే నయం అని ఎన్నికలలో ఓట్లు అతడికి కురిపించి గెలిపిస్తే ఏమవుతుంది? ముల్లును ముల్లుతో తియ్యడం లాంటిదే కదా.

కం. జోకొట్టి ధనాదులతో
ఊఁకొట్టించిన తదుపరి యోట్లు లభించన్
తాకట్టు పెట్టి భవితను
ఛీకొట్టించు కొనుటఁ గన చిత్రమె, కు(సు)మతీ. 15

(జోకొట్టు = నిద్రపుచ్చటానికి మెల్లగా తట్టు, ఊకొట్టించు = ఆలకింపజేయు, తదుపరి = అటు తరువాత, తాకట్టు = కుదువ, భవిత = జరుగవలసినది, ఛీకొట్టు = అసహ్యించుకొను, కను = చూచు, చిత్రము = వింత)

ధనం, ఇతరాలతో జోకొట్టి ఊకొట్టించి, ఆ తరువాత ఓట్లు దక్కగా, భవిష్యత్తును తాకట్టు పెట్టి ఛీకొట్టించుకోవడాన్ని చూడడం వింతా?

కం. బిచ్చము వేయుట ఘనతను
పుచ్చుకొనుట హీనత యను బోధములన్ బో
ఋచ్చిరి బాహాటముగా
యిచ్చగ యెన్నికల యందు, యెరుగుము కు(సు)మతీ. 16

(బిచ్చము = ముష్టి, ఘనత = గొప్పదనము, హీనత = నీచత్వము, బోధము = సంగతి, పోఋచ్చు = విడిచిపెట్టు, బాహాటము = బహిరంగము, ఇచ్చ = కోరిక)

ముష్టి వెయ్యడం గొప్ప, పుచ్చుకోవడం నీచత్వం అనే సంగతులను బహిరంగంగా కోరిన విధంగా ఎన్నికలలో విడిచిపెట్టారు, తెలుసుకో.

కం. బలహీనుల కేమిచ్చిన
వలదన రుచితంబు లన్న వాపిరి చేతన్
బలహీనుల బల మది యని
తెలిసిన నాయకుల కోట్లు తెచ్చును కు(సు)మతీ. 17

(బలహీనుడు = బడుగు, ఉచితము = ఊరికే ఇచ్చేది, వాపిరి = అధికమైన కోరిక)

ఉచితాలంటే (freebies) ఉన్న అధికమైన కోరిక వల్ల బలహీనులకు ఏమిచ్చినా వద్దనరు. అది బలహీనుల బలం అని తెలిసిన నేతలకి ఓట్లు తెస్తుంది.

కం. విచ్చలవిడిగా పాలన
నచ్చిన విధముగ సలిపిన నైజముఁ గనగన్
కచ్చితముగ యోడించెడి
హెచ్చరికయె యెన్నిక లన యెరుగుము కు(సు)మతీ. 18

(విచ్చలవిడి = యథేచ్ఛం, పాలన = ఏలుబడి, సలుపు = చేయు, నైజము = స్వభావము, కను = చూచు, కచ్చితము = ఎచ్చుతక్కువలు లేక సరిగా నుండునది, హెచ్చరిక = రానున్న ప్రమాదాన్ని సూచించే జాగ్రత్త, ఎరుగు = గ్రహించు)

ఎన్నిక లంటే విచ్చలవిడిగా నచ్చిన విధంగా పరిపాలన చేసిన స్వభావాన్ని చూడంగానే కచ్చితంగా ఓడించే హెచ్చరిక అని గ్రహించు.

కం. అప్పుల కొక మితి యుండగ,
యప్పనముగ యిచ్చు వాటి నాపుట ప్రభుతన్
తప్పా? తప్పదు మాకని
యప్పుల మితి పెంచుటన్న యబ్రమె కు(సు)మతీ. 19

(మితి = హద్దు, అప్పనము = తేరగా, ఆపు = ఆపు చేయు, ప్రభుత = పరిపాలనా వ్యవస్థ, అబ్రము = ఆశ్చర్యము)

ప్రభుత్వం తీసుకునే ఋణాలకి ఒక హద్దు ఉండగా [Fiscal Responsibility and Budget Management (FRBM) Act క్రింద ఇది విధించబడింది], ఉచితంగా ఇచ్చేవాటిని

(freebies) ఆపు చెయ్యడం తప్పా? అవి ఇవ్వడం మాకు తప్పదని, ఋణాల హద్దును పెంచడం ఆశ్చర్యమే.

కం. అలవాటై యుచితంబులు
కెలసంబన చీదరించు కింకణు లున్నం
బొలియును సంఘమున ప్రగతి,
నెలకొను నొకపాటి జడత, నిక్కము కు(సు)మతీ. 20

(ఉచితము = ఊరికే ఇచ్చేది, కెలసము = పని, చీదరించు = అసహ్యించు, కింకణుడు = సోమరి, పొలియు = నశించు, సంఘము = సమాజము, ప్రగతి = అభివృద్ధి, నెలకొను = స్థిరపడు, పాటి = విధము, జడత = నిశ్చేష్టత, నిక్కము = సత్యము)

ఊరికే ఇచ్చేవాటికి అలవాటు పడి పని అంటే అసహ్యించుకునే సోమరులు ఉంటే, సమాజంలో అభివృద్ధి నశించి ఒక విధమైన నిశ్చేష్టత నెలకొంటుంది అన్నది నిజము.

కం. లెక్కకు పనికొచ్చెద రీ
చిక్కిన వర్గముల వారు, సీట్లను పనులస్
దక్కవలె పాలు వీరికి,
హక్కుగ నిచ్చెద మటన్న హామీ లెన్నో
జక్కొనెఁ గానీ, యవి పై
లక్కనమునుఁ జూపి యిడగ లక్ష్మీవంతుల్
దక్కించుకొనిరి, మిగిలెను
లెక్కకు తెగలన్ని పూర్వ రీతినె కు(సు)మతీ. 21

(చిక్కు = బక్కచిక్కు, వర్గము = తెగ, దక్కు = లభించు, పాలు = భాగము, హామీ = ఏదైనా పని జరిగేట్లు చూస్తామని ఇచ్చే మాట, జక్కొను = ప్రాప్తించు, లక్కనము = లక్షణము, ఇడు =

ఇచ్చు, లక్ష్మీవంతుడు = సంపదగలవాడు, దక్కించుకొను = వశపఱచుకొను, తెగ = సజాతీయ సమూహము, పూర్వ = ముందుండునది, రీతి = విధము)

లెక్కించేటప్పుడు కొంత మంది జనాన్ని చూపెట్టి వీళ్ళు వెనుకబడిన వాళ్ళు, వీళ్ళకి సాయం చెయ్యాలి అని వెసులుబాట్లు కొన్ని కల్పించి, తీరా ఇచ్చే సమయానికి వీళ్ళూ ఇలాంటి వాళ్ళే అని సంపద ఉన్న వాళ్ళకి ఇవ్వడం మనం చూస్తూనే ఉన్నాం. అంటే, ఎప్పుడు వెనుకబడిన వాళ్ళని లెక్కపెట్టినా, తయారుగా ఏ మాత్రం మార్పు లేకుండా అప్పటి వాళ్ళే ఉంటారు. ఈ పద్యంలోని భావన అదే.

ఈ వెనుకబడిన జాతుల వారు లెక్కకు పనికొస్తారని, సీట్లలోను ఉద్యోగాలలోను వాళ్ళకి భాగం లభించాలని, హక్కుగా ఇస్తాము అన్న హామీ లెన్నో ప్రాప్తించినాయి గానీ, అలాంటివి పైలక్షణాన్ని చూసి ఇవ్వడం వల్ల భాగ్యవంతులు దక్కించుకున్నారు. ఆ వెనుకబడిన జాతు లన్నీ అదివరకటి లాగానే లెక్కకు మిగిలాయి.

కం. కుల మాధారముగా యిడు
పలు యనుకూలత లెపు డుపపన్నుల కందస్
బలహీనులు మాత్ర మెపుడు
బలియగు టన కాదె భేదభావము కు(సు)మతీ. 22

(ఇడు = ఇచ్చు, అనుకూలత = సహాయము, ఉపపన్నుడు = ధనవంతుడు)

కులం ఆధారంగా ఇవ్వడానికి ఉద్దేశించిన అనుకూలతలు వివక్ష, భేదభావం (discrimination) పోగొట్టడానికే. కానీ అవి అర్హులకు (deserving persons) చేరుతున్నాయా అన్నదే ప్రశ్న. ఈ పద్యంలో వ్యక్తపరచిన ఆవేదన దాని గురించే.

కులం ఆధారంగా ఇచ్చే అనేకమైన సహాయాలు ఎప్పుడూ ధనవంతులకి అందగా, బలహీనులు మాత్రం ఎప్పుడూ బలి అవ్వడం భేదభావం కాదా?

కం. వెనుక బడిరని వెసులుబా
ట్లని కల్పించి యట నున్న యాఢ్యుల యందే
యనువంశికముగఁ జేయుచు
పెను పథక మటంచుఁ జెప్ప బీరమె కు(సు)మతీ. 23

(వెనుకఁబడు = వెనుకచిక్కు, వెసులుబాటు = అనుకూలత, ఆఢ్యుఁడు = ధనవంతుఁడు, అనువంశికము = వంశపారంపర్యము, పెను = గొప్ప, పథకము = స్కీము, బీరము = డంబాచారము)

వెనుకబడ్డారని అనుకూలతలు కల్పించి వాళ్ళలో ఉన్న ధనవంతులలోనే వంశపారంపర్యం చేస్తూ గొప్ప స్కీము అంటూ చెప్పుకోవడం డంబాచారమే.

కం. ప్రతిదినము పూలు కోసిన
ద్రుతముగ మఱునాఁడు మరల తోఁతెంచు నటుల్
ప్రతి సుంకము పౌరుల సం
హతిఁ గుంచక పెంచు చుంటె యక్కఱ కు(సు)మతీ. 24

(ద్రుతము = త్వరితము, తోఁతెంచు = ఉదయించు, సుంకము = పన్ను, సంహతి = సత్తువ, కుంచు = తగ్గించు, పెంచు = వృద్ధిచేయు, ఉంట = ఉండుట, అక్కఱ = ఆవశ్యకము)

ప్రతిరోజు పూలు కోస్తే త్వరగా మర్నాడు మళ్ళీ పుట్టుకొచ్చినట్లుగా ప్రతి పన్ను నాగరికుల సత్తువ తగ్గించకుండా వృద్ధి చేయడమే ఆవశ్యకము.

కం. సిద్ధాంతము లమలు సలుప,
యుద్ధంబుల వలన చెఱుపు యుండ భరింపస్,
రాద్ధాంతమ్ములు తీర్చగ,
సిద్ధాయము వ్యయమగుటయె సిద్ధము కు(సు)మతీ. 25

(సిద్ధాంతము = నిర్ణయము, అమలు = ఆచరణలో పెట్టుట, సలుపు = చేయు, చెఱుపు = నష్టము, రాద్ధాంతము = తగవు, తీర్చు = చక్కబరుచు, సిద్ధాయము = సుంకము, వ్యయము = ఖర్చు, సిద్ధము = యథార్థమైన)

Tax revenue is spent for implementation of policies, indemnifying the losses occurring due to wars, and addressing controversies. నిర్ణయాలు అమలు చెయ్యడానికి, యుద్ధాల వల్ల కలిగే నష్టం భరించడానికి, తగవులు తీర్చడానికి, సుంకము ఖర్చు అవ్వడం యథార్థం.

కం. ఎల్లల నటు నిటు జరుపుట
పల్లెల లోనేఁ గల యలవాటని యెంచస్
గల్లగు, దేశముల బఱుల
గల్లంతుఁ తగవుల నడుమఁ గనమే కు(సు)మతీ. 26

(ఎల్ల = సరిహద్దు, పల్లె = చిన్న గ్రామము, ఎంచు = తలఁచు, కల్ల = అబద్ధము, బఱి = హద్దు, గల్లంతు = అల్లరి, తగవు = కలహము, కను = చూచు)

సరిహద్దులను అటు ఇటు జరపటం అన్నది చిన్న గ్రామాలలోనే ఉన్న అలవాటని అనుకుంటే కల్లే. దేశాల హద్దులు కలహాల మధ్య అల్లరై పోవడం చూడమా.

కం. కృత్యము ధర్మము కొర కను
సత్యమునకు కట్టుబడిన జయమగు నిలలో
చైత్యం బీ దేహమనుచు
నిత్యము మదిలోఁ దలఁచు మనీషికి, కు(సు)మతీ. 27

(కృత్యము = చేయఁదగిన పని, కట్టుబడు = నియమాలకు లోబడు, జయము = గెలుపు, ఇల = భూమి, చైత్యము = దేవాలయము, దేహము = శరీరము, మది = మనస్సు, తలఁచు = ఎంచు, మనీషి = బుద్ధిమంతుడు)

దేహం దేవాలయమని ఎప్పుడూ మనస్సులో అనుకునే బుద్ధిమంతుడికి, చేయఁదగిన పని ధర్మం కోసం అనే సత్యానికి కట్టుబడితే ఈ లోకంలో గెలుపే దక్కుతుంది.

కం. భద్రత వ్యాపారంబై
క్షుద్రంబగు రూపుఁ దాల్చ, సుల్తా న్లంత
శ్ఛిద్రముల నడ్డగించ స
ముద్ర రవాణా, పెరిగె చమురు ధర, కు(సు)మతీ. 28

(భద్రత = రక్షణ, క్షుద్రము = నీచము, రూపు = ఆకృతి, తాల్చు = ధరించు, సుల్తాను = అరబ్బు ప్రభువు, అంతశ్ఛిద్రము = అంతఃకలహము, అడ్డగించు = నిరోధించు, ధర = వెల)

Some countries have been providing security and military services to other countries for money and other favours. Thus, security service has become a business not only among companies, private institutions and households, but also among nations. This poem refers to the context arising out of war in and around Iran.

రక్షణ అన్నది వ్యాపారమై నీచమైన రూపు తాల్చగా, అరబ్బు రాజులు అంతఃకలహాలతో సముద్ర రవాణాని నిరోధించగా, చమురు ధర పెరిగింది.

కం. ఆకలి బలహీనతనుచు
చీకటి కోణముల చరిత చెప్పకఁ జెప్పెన్
చేకూరగ స్వాతంత్ర్యము
యాకలనంబయ్యె మనకు నంతయు కు(సు)మతీ. 29

(బలహీనత = అశక్తత, చీకటి కోణములు = దాగి ఉన్న రహస్యాలు, చేకూరు = లభించు, ఆకలనము = అవగాహనము)

ఆకలి బలహీనత అంటూ చీకటి కోణాల చరిత్ర చెప్పకనే చెప్పింది. స్వాతంత్ర్యము లభించడంతోనే మనకు అంతా అర్థమయ్యింది.

కం. మనుజులు సృష్టించిన దే
వుని మరల సృజించు మానవుల కోవెలలన్
తనిఖీ కందని కల్తికి
యనుకంపగ పంచు లడ్డు యడ్డా కు(సు)మతీ. 30

(మనుజుడు = మానవుడు, సృష్టించు = పుట్టించు, సృజించు = పుట్టించు, కోవెల = దేవాలయము, తనిఖీ = పరీక్ష, కల్తి = స్వచ్ఛము కాకుండా చేసే మిశ్రితము, అనుకంప = ప్రసాదము, అడ్డు = అడ్డంకి)

మానవులను సృష్టించిన దేవుణ్ణి మళ్ళీ సృష్టించిన మానవుల దేవాలయాల్లో తనిఖీకి దొరకని కల్తీ చెయ్యడానికి ప్రసాదంగా పంచే లడ్డూలు ఏమన్నా అడ్డంకియా?

కం. నేర విచారణ జరుపుచు
పూరణ మవ్వక మునుపు విపులముగ వ్యాఖ్యల్
నేరుగ ప్రసారము సలుపు
టే రీతినిఁ జూతు మన్న యేహ్యమె కు(సు)మతీ. 31

(పూరణము = పూర్తి, మునుపు = ముందు, విపులము = అధికము, వ్యాఖ్య = వివరణము, నేరుగ = తిన్నగా, ప్రసారము = వ్యాపనము, సలుపు = చేయు, రీతి = విధము, ఏహ్యము = అసహ్యము)

ఏవైనా నేరాలు విచారణ చేసేటప్పుడు, ఆ విచారణ పూర్తి కాక ముందే, వాటి తాలూకు మధ్యంతర సమాచారం ఎప్పటికప్పుడు టీవీ వార్తలలోను ఇతర సమాచార మాధ్యమాల ద్వారాను ప్రసారం చెయ్యడం అనేది చాలా తప్పు. అలా చెయ్యడం వల్ల, విచారణ చేసే వాళ్ళ మీద అనవసరమైన ఒత్తిడి ఉండడమే కాకుండా, ఒక్కోసారి ముద్దాయిలకి పట్టుబడకుండా తప్పించుకునే మార్గాలను సూచించినట్లవుతుంది. అదీకాక, సమాచార మాధ్యమాలలో ఒక నేరం గురించి ఎత్తించే హోరు నేరం ఋజువు కాక ముందే ముద్దాయిలను నేరస్థులుగా కోర్టులు కాకుండా వీళ్ళే చేస్తున్నట్లుంటుంది. ఇవేవీ మంచి పనులు కావు అని చెప్పడమే ఈ పద్యం ఉద్దేశ్యం.

నేర విచారణ జరుపుతూ, అది పూర్తి కాక ముందే ఎక్కువగా వివరణలను నేరుగా ప్రసారం చెయ్యడం ఎలా చూద్దామన్నా అసహ్యమే.

కం. ఇరువది నాలుగు గంటలు
తెరి పీయక వార్త లెన్నొ తెర నుంచుటనస్
నిరవద్యమైన సోదిని
నిరతము విసు గెత్తకుండ నెఱపుటె కు(సు)మతీ. 32

(తెరిపి = విశ్రాంతి, తెర = యవనిక, నిరవద్యము = ఆక్షేపణలేనిది, సోది = అనవసరమైన విషయము, నిరతము = ఎల్లప్పుడు, నెఱపు = వ్యాపింపచేయు)

ఇరవై నాలుగు గంటలు (రోజంతా) విరామం లేకుండా ఎన్నో వార్తలు తెర మీద ఉంచడం అంటే, ఆక్షేపణ లేని అనవసరమైన విషయాలను ఎప్పుడూ విసుగు ఎత్తకుండా వ్యాపింపచేయడమే.

కం. అడవికి నీ వరిగిన నేఁ
బడయుదు నొంటిగ సవతుల వళుకులు మరలన్
విడువకు మని మాత యనగ
కొడుకగు శ్రీరాము డీయకొనక యిటు లనెన్
యడలకు మాతా! నా మను
గడలో పత్ని యన సీత కాక పరులకున్
యిడను మనికి, ప్రత్యుత్తర
మిడుటను నిష్ఠూరము వెలయించెను శ్రీరా
ముడు సవతిపోరును తలచి,
యడిగిన ప్రశ్న కిటుఁ జెప్పు టబ్రమె కు(సు)మతీ. 33

(అరుగు = పోవు, పడయు = సంపాదించు, ఒంటిగ = ఒంటరిగా, సవతి = తోడిపెండ్లాము, వళుకు = తగవు, మరల = మళ్ళీ, విడుచు = విడిచిపెట్టు, మాత = తల్లి, ఈయకొను = అంగీకరించు, ఇటు = ఇట్లు, అడలు = భయపడు, మనుగడ = జీవనము, పత్ని = భార్య, పరులు = ఇతరులు, ఇడు = ఇచ్చు, మనికి = స్థానము, ప్రత్యుత్తరము = జవాబు, ఇడు = ఇచ్చు, నిష్ఠూరము = దూషణము, వెలయించు = వెల్లడించు, సవతిపోరు = సవతుల కయ్యము, తలచు = పరిగణించు, ఇటు = ఇట్లు, అబ్రము = ఆశ్చర్యము)

శ్రీమద్రామాయణంలో అయోధ్య కాండము లోని ఒక ఘట్టం ఇది. శ్రీరామునికి వనవాసం వెళ్ళాలని ఆజ్ఞయైన పిదప ఆతడు తల్లియైన కౌసల్య దగ్గర సెలవు తీసుకోవడానికి వెళ్ళినప్పుడు వారిద్దరి మధ్య జరిగిన సంభాషణ ఈ పద్యంలో అంశం.

నీవు అడవికి వెళ్ళిపోతే నేను ఒంటరిగా మళ్ళీ సవతుల తగాదాలు పడాల్సి వస్తుంది, నన్ను వదలి వెళ్ళకు, అని తల్లి అనగా, పుత్రుడైన శ్రీరాముడు అంగీకరించక ఈ విధంగా అన్నాడు: "భయపడకు మాతా! నా జీవితంలో భార్య అంటే సీత కాకుండా ఇతరులకు స్థానము ఇవ్వను". జవాబు ఇవ్వడంలో సవతిపోరును పరిగణనలోకి తీసుకుని శ్రీరాముడు నిందను వెల్లడించాడు. ఇలా అడిగిన ప్రశ్నకి చెప్పడం ఆశ్చర్యమే. అంటే, అమ్మా! నీ కొచ్చిన కష్టాలన్నీ మా తండ్రి బహుభార్యాత్వం వల్లే కదా, నేను ఆ తప్పు చేయను అని చెప్పినట్లు.

కం. భార్యను బందీ చేసిన
చర్యకు ప్రతిచర్యఁ జేయు చారిత్రమునస్
భార్య కళంకి యనగ యౌ
దార్యము లేక విడనాడఁ దగునా కు(సు)మతీ. 34

(ప్రతిచర్య = తిరిగి తీసే దెబ్బ, చారిత్రము = గాథ, కళంకి = దోషము కలది, ఔదార్యము = దయాదాక్షిణ్యము, విడనాడు = త్యజించు, తగు = యుక్తమగు)

భార్యని బందీ చేసిన పనికి ప్రతిక్రియ చేసిన గాథలో, అంటే రామాయణంలో, భార్యయైన సీతను కళంకి అని దయాదాక్షిణ్యము లేకుండా త్యజించడం సరియైన పనా.

కం. ప్రోచే వారెవ రనుచుస్
వేచే జను లక్కజముగ ప్రేరితు లగుచుస్
పైచేయి నిడిరి దధిజము
దోచే యొక దొంగ కనుచు దూఱకు కు(సు)మతీ. 35

(ప్రోచు = రక్షించు, వేచు = ఎదురుచూచు, అక్కజము = ఆశ్చర్యము, ప్రేరితుడు = పురికొల్పబడ్డవాడు, పైచేయి = ఆధిక్యంలో ఉన్న స్థితి, ఇడు = ఇచ్చు, దధిజము = వెన్న, దోచు = దొంగిలించు, దూఱు = నిందించు)

దీన్ని వ్యాజస్తుతి అంటారు. రక్షించే వారు ఎవరు అంటూ ఎదురుచూసే జనాలు ఆశ్చర్యంగా ప్రేరితులవుతూ వెన్నను దోచే ఒక దొంగకి (కృష్ణుడు) పైచేయి నిచ్చారని తిట్టకు.

కం. ఎనిమిదవ పుత్రుని వలన
తనకు మరణ ముండు ననుచు దంపతులఁ జెఱస్
యునిచి కలిపె కంసుడు, వా
రిని వేరుగ నుంచు తెలివి లేదుగ కు(సు)మతీ. 36

(చెఱ = కారాగృహము, ఉనుచు = ఉంచు)

ఎనిమిదవ పుత్రుని వల్ల తనకు చావు ఉంటుందని దంపతులని కారాగృహంలో కలిపి ఉంచాడు కంసుడు. వాళ్ళని విడివిడిగా ఉంచాలన్న తెలివి లేదుగా.

కం. అల్లుని మంచికి కృష్ణుని
కల్లకు ధర్మజుని పేర్లు ఖ్యాతినిఁ గొనగా,
చెల్లిరి కంస, శరగురులు,
యెల్లిద మయ్యె సుగుణములు యెరుగుము కు(సు)మతీ. 37

(కల్ల = అబద్ధము, ఖ్యాతి = కీర్తి, కొను = తెచ్చుకొను, చెల్లు = చచ్చు, శరగురుడు = ద్రోణుడు, ఎల్లిదము = చులకనయైనది, సుగుణము = మంచి గుణము)

అల్లుని మంచితనానికి కృష్ణుని పేరు, అబద్ధానికి ధర్మరాజు పేరు కీర్తి తెచ్చుకొనగా, కంసుడు, ద్రోణాచార్యుడు మాత్రం చచ్చారు. మంచి లక్షణాలంటే చులకన భావం ఏర్పడిందని తెలుసుకో.

కం. చెఱ నున్న స్త్రీల విడుదల
చెఱఁ బుట్టిన వాడుఁ జేయు చేష్టను మను వ
క్కఱ యయె, త్యాగము కాదది
నెఱవగు తమక మని వక్కణించరె, కు(సు)మతీ. 38

(చెఱ = కారాగృహము, విడుదల = విమోచనము, చేష్ట = పని, మనువు = వివాహము, అక్కఱ = ఆవశ్యకకార్యము, నెఱవు = అధికము, తమకము = మోహము, వక్కణించు = చెప్పు)

నరకాసురుడు అనే రాక్షసుడు 16,100 మంది రాజకుమార్తెలను చెఱలో బంధిస్తాడు. శ్రీకృష్ణుడు నరకాసురుడిని వధించి ఆ స్త్రీలను విడుదలను చేస్తాడు. అప్పటి సమాజంలో, ఒకసారి అపహరణకు గురై చెఱలో ఉన్న స్త్రీలను ఎవరూ వివాహం చేసుకోరు. ఆ స్త్రీలకు సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని అందించడానికి, శ్రీకృష్ణుడు వారిని తన భార్యలుగా స్వీకరించి భద్రత కల్పించాడు.

కారాగృహంలో పుట్టిన వాడు (కృష్ణుడు) కారాగృహంలో ఉన్న స్త్రీలను విడుదల (నరకుని చెఱ నుండి విడుదల) చేసే పనిలో వివాహం ఆవశ్యక కార్య మయింది. అది త్యాగం కాదు, అధికమైన మోహం అని అనరా.

కం. అంధుడు తన భర్తని తా
నంధత్వము స్వీకరించ, యభియాతు లవస్
గాంధారి సంతు, యా గ
ర్వాంధులఁ గని లోక మంత యడలెను, కు(సు)మతీ. 39

(అంధుఁడు = గ్రుడ్డివాడు, అంధత్వము = గ్రుడ్డితనము, స్వీకరించు = పరిగ్రహించు, అభియాతి = అహితుడు, సంతు = సంతానము, అడలు = భయపడు)

గ్రుడ్డివాడు ధృతరాష్ట్రుడు తనకు భర్త అని తాను కూడా గ్రుడ్డితనాన్ని స్వీకరించగా (కళ్ళకు గంతలు కట్టుకొని), గాంధారి సంతానం అహితు లయ్యారు. ఆ మదాంధులని చూసి లోక మంతా భయపడింది. అంటే, గాంధారి పిల్లల బాధ్యత స్వీకరించకుండా కళ్ళకు గంతలు కట్టుకొని కూర్చోవడం వల్ల, వాళ్ళు లోకకంటకులుగా పెరిగారు.

కం. కను లిచ్చితి వీ సభలో,
కనులే కొఱ నేను రాజు కాకుండుటకున్,
కను లిడ యీ ధృతరాష్ట్రుడె
మనుజేంద్రుడు, పాండవులకు మండల భాగం
బు నిడు యగత్యము కలదే,
యన శౌరికి వేరు మార్గ మమరునె, కు(సు)మతీ. 40

(కొఱ = లోపము, ఇడు = ఇచ్చు, మనుజేంద్రుడు = రాజు, మండలము = దేశము, అగత్యము = అవశ్యకత, శౌరి = కృష్ణుడు, అమరు = ఏర్పడు)

ధృతరాష్ట్రుడికి కళ్ళు లేకపోవడమే మహాభారతానికి మూలం. ఆ కారణం వల్లే ఆయనికి రాజ్యాధికారం లేదని పాండురాజును రాజుగా చేశారు. ఆ తరువాత ఆ హక్కు పాండురాజు పెద్దకొడుకైన ధర్మారాజుకు సంక్రమించింది. మా నాయన అంధుడే కానీ నేను అంధుడను కానని ధృతరాష్ట్రుడి పెద్దకొడుకైన దుర్యోధనుని వాదన. ఆ ఇద్దరి మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో సంధి జరుపుదామని దూతగా శ్రీకృష్ణుడు కౌరవ సభకి వస్తాడు. సభలో జరిగిన ఆవేశకావేశాల మధ్య కృష్ణుడు తన విశ్వరూపం చూపిస్తాడు. అది దర్శించుకోవడానికి ధృతరాష్ట్రుడికి కళ్ళు ఇస్తాడు, కృష్ణుడు. అవి లేకే కదా ఈ గొడవంతా. కళ్ళు వచ్చేశాయిగా,

ఇంక వివాదం ఏముంది అని ధృతరాష్ట్రుడు అంటే ఎలా ఉండేది? ఈ పద్యంలోని వృత్తాంతం అదే.

ఈ సభలో కళ్ళు ఇచ్చావు. నేను రాజు కాకుండా ఉండడానికి కళ్ళే లోపం. కళ్ళు ఇవ్వడం వల్ల ఈ ధృతరాష్ట్రుడే రాజు, పాండవులకి రాజ్య భాగం ఇచ్చే ఆవశ్యకత ఉందా, అని అంటే కృష్ణుడికి వేరే దారి దొరుకుతుందా?

కం. రాగాతీతముగా యే
భోగమునకు యెట మితియొ ప్రపూర్వగు డెరుగుస్
నాగాస్త్రము విడువగ తల
పాగా పడఁగొట్టఁ జేయు ప్రతిభది కు(సు)మతీ. 41

(రాగము = అనురాగము, అతీతము = అతిక్రమించినది, భోగము = సుఖము, మితి = పరిమితి, ప్రపూర్వగుడు = పరమాత్మ, మడపు = ప్రయోగించు, ప్రతిభ = అప్పటప్పటికి వికసించెడు బుద్ధి)

భగవంతుడి చేతిలో punctuation power ఉంది. ఎవరికి ఎక్కడ ఫుల్ స్టాప్ పెట్టాలో కామా పెట్టాలో ఆయనకి తెలుసు. అనురాగానికి అతీతంగా ఏ సుఖానికి పరిమితి ఎక్కడో పరమాత్మకి తెలుసు. నాగాస్త్రము ప్రయోగించగా (కర్ణుడు) అది తలపాగాని (అర్జునుడి) మాత్రమే పడగొట్టేటట్లు చేసే ప్రతిభ అది (కృష్ణునిది).

కం. సావిత్రి భర్త ప్రాణము
వోవగ వెన్నంటె యముని పూజించుచు, యా
త్రోవనెఁ జన కొంతదనుక
వైవస్వతు డాయువు నిడె వరముల తోడస్,
జీవదు లీ వెరవు నొదవె

జీవుల మానసిక రుజల చింతలుఁ బాపఁ,
భావనలను యా ధోరణి
నావంతఁ గనంగ నెవరి యందైనను మే
ధావియగు వైద్యు డటులా
నోవరి వలె వ్యవహరించ నుసుగు సమస్యల్
సావాసమున యగద మిడ
నా వరుసను, రుజలు ముడుగు టధికము కు(సు)మతీ. 42

(వెన్నంటు = వెంబడించు, చను = వెళ్ళు, దనుక = వఱకు, వైవస్వతుడు = యముడు, జీవదుడు = వైద్యుడు, వెరవు = ఉపాయము, ఒదవు = ఉపయోగించు, జీవి = జీవించువాఁడు, మానసిక = మనసులో వున్నది, రుజ = రోగము, చింత = దిగులు, పాపు = తొలఁగఁజేయు, భావన = ఆలోచన, ధోరణి = ప్రవర్తన, ఆవంత = కొంచెమైనను, కను = చూచు, మేధావి = సూక్ష్మబుద్ధిగలవాడు, నోవరి = వ్యాధిగలవాఁడు, వ్యవహరించు = ప్రవర్తించు, నుసుగు = తొలగు, సావాసము = స్నేహము, అగదము = ఔషధము, ఇడు = ఇచ్చు, వరుస = క్రమము, రుజ = రోగము, ముడుగు = తగ్గు, అధికము = ఎక్కువ)

మహాభారతం లోని వనపర్వంలో వర్ణించబడిన సావిత్రి సత్యవంతుల కథలో సత్ఫలితాన్ని ఇచ్చిన సావిత్రి యముణ్ణి వెంబడించి వెళ్ళడం అనే వృత్తాంతం ప్రతీకాత్మకంగా (symbolic) తీసుకుంటే, అలా వెళ్ళడం మానసికరోగుల విషయంలో ఒక గొప్ప ఉపాయంగా (strategy) పనిచేస్తుందని భారతీయ మనోవైద్యంలో (Indian Psychiatry) మార్గదర్శకులు (pioneers) చెప్పారని అని ఎక్కడో చదివాను. ఈ పద్యం దాని గురించే.

సావిత్రి తన భర్తయైన సత్యవంతుని ప్రాణం పోవగా, వెంబడించి యముణ్ణి పూజిస్తూ ఆ త్రోవలోనే కొంతవరకు వెళ్ళగా, యముడు వరాలతో పాటు ఆయువును కూడా ఇచ్చాడు. వైద్యులు ఈ ఉపాయాన్ని మనుషుల మానసిక రోగాలకి సంబంధించిన దిగుళ్ళు తొలఁగఁజేయడానికి ఉపయోగించారు. ఆలోచనలలో ఆ ధోరణి కొంచెమైనా ఎవరిలోనైనా చూస్తే

సూక్ష్మబుద్ధిగల వైద్యుడు ఆ రోగి వలె ప్రవర్తిస్తే సమస్యలు తొలగిపోతాయి. ఆ క్రమంలో స్నేహంతో మందు ఇస్తే రోగాలు ఎక్కువగా తగ్గుతాయి.

కం. సత్తువఁ గల రోజులలో
విత్తిన నైపుణి తెలివియు వృద్ధాప్యమునన్
చిత్తమునకు శాంతి నిడఁగ
యొత్తిడు లోర్చెడి స్వభావ మొదవును కు(సు)మతీ. 43

(సత్తువ = దేహమునందలి బలము, విత్తు = నాటు, నైపుణి = నేర్పరితనము, వృద్ధాప్యము = ముసలితనము, చిత్తము = మనసు, ఇడు = ఇచ్చు, ఒత్తిడి = పీడనము, ఓర్చు = సహించు, ఒదవు = కలుగు)

శారీరక శక్తి ఉన్న రోజులలో నాటిన నైపుణ్యం, తెలివి, వృద్ధాప్యంలో మనసుకు శాంతిని ఇవ్వగా ఒత్తిడులు సహించే స్వభావం అబ్బుతుంది.

కం. ఒక భార్యయు, ఒక సుతుడును,
ఒక సుతయును, ఒక గృహంబు, ఒక జీవిక వా
డుకపడ, యత్యాశకు తా
విక యుండదు, కడు స్థిరత్వ మేర్పడు, కు(సు)మతీ. 44

(జీవిక = వృత్తి, వాడుకపడు = అలవడు, అత్యాశ = మితిమీఱిన ఆశ, తావు = స్థానము, కడు = మిక్కిలి)

జనాభా శాస్త్రంలో (Demography) ఖచ్చితమైన భర్తీ (exact replacement), స్థిర జనాభా (stationary population) అన్న రెండు భావనలు (concepts) ఉన్నాయి. సగటున (on the average) ఒక భార్య ఒక భర్త కలిసి ఒక కుమారుడికి ఒక కుమార్తెకి మాత్రమే జన్మనిస్తే

దాన్ని ఖచ్చితమైన భర్తీ అంటారు. అట్లా ఒక ప్రాంతం అంతా దీర్ఘకాలం పాటు జరిగితే ఆ ప్రాంతంలో స్థిర జనాభా ఉంటుంది. అంటే, పాత నీరు పోయి ఎప్పటికప్పుడు క్రొత్త నీరు వస్తూ ఉండడం వల్ల నీటిమట్టం ఎప్పుడూ ఒకేలా ఉన్నట్లు అని అర్థం. అదే భావన, ఉండడానికి ఒక ఇల్లు, చెయ్యడానికి ఒక వృత్తి అన్నవాటికి కూడా విస్తరిస్తే బాగుంటుందని ఈ పద్యంలోని ప్రతిపాదన.

ఒక భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె, ఒక ఇల్లు, ఒక వృత్తి - వీటికి అలవాటు పడితే అత్యాశకు స్థానం ఉండదు. మిక్కిలి స్థిరత్వం ఏర్పడుతుంది.

కం. అర్హత లేని దమర యం
తర్హితముగ గర్వ మడరు, తర్కము కొదపై
గర్హితులుగ మారెద, రం
తర్హేతువెదో కనుగొన తరమా, కు(సు)మతీ. 45

(అర్హత = యోగ్యత, అమరు = సిద్ధించు, అంతర్హితము = మఱుఁగుపడినది, అడరు = అతిశయించు, తర్కము = హేతువు, కొదవ = లోపము, గర్హితుడు = ముద్దాయి, అంతర్హేతువు = పైకి తెలియరాని కారణము, తరము = శక్యము)

Those who possess what they don't deserve will usually be egoistic. ఇది నా జీవితానుభవం. యోగ్యత లేనిది దక్కితే లోలోపల గర్వం అతిశయిస్తుంది. కారణం లేకుండా నిందితులుగా మారతారు. పైకి తెలియరాని కారణము ఏదో కనుక్కోవడం శక్యమా.

కం. చీమలు చెదలును పెట్టగ
పాముల కిల్లగుచు పుట్ట పరగిన భంగిస్
నీమము లెడలి గడించిన
సోమరి వారసుల కందు సులువుగ కు(సు)మతీ. 46

(పరగు = ప్రవర్తిల్లు, భంగి = విధము, నీమము = నియమము, ఎడలు = విసర్జించు, గడించు = సంపాదించు, సోమరి = బద్ధకముగల, వారసుఁడు = ఆస్తి మొదలగు వానిలో వంశపరంపరగా అందుకునే హక్కుదారు, సులువు = సులభము)

చీమలు చెదలు పెట్టిన పుట్ట పాములకి ఇల్లు అయిన విధంగా నియమాలు విసర్జించి సంపాదిస్తే బద్ధకస్థులైన వారసులకి సులభంగా అందుతుంది.

కం. ఎక్కడ సంపదఁ గలిగిన
యక్కడనే వృద్ధి యుండు నన్నది నిజమే
యెక్కుడు నిపుణులుఁ గలిగిన
యక్కడ ప్రగతి యగుట ఋత మనమే కు(సు)మతీ. 47

(సంపద = ఐశ్వర్యము, వృద్ధి = అభ్యుదయము, ఎక్కుడు = అధికము, నిపుణుడు = నేర్పరి, ప్రగతి = అభివృద్ధి, ఋతము = సత్యమైనది)

ఎక్కడ ఐశ్వర్యము ఉంటే అక్కడనే అభ్యుదయము ఉంటుంది అన్న మాట నిజమే. ఎక్కువగా నేర్పరులు ఉంటే అక్కడ అభివృద్ధి కలగడం నిజం అని అనమా.

కం. మత సంస్థల సిరిని ప్రజా
హితకార్యముల కొరకే వ్యయించ వలెస్, యీా
వితమే సంఘమునకు శా
శ్వతమని నిజపరచె సత్యసాయియె కు(సు)మతీ. 48

(సిరి = సంపద, వ్యయించు = ఖర్చుచేయు, వితము = విధము, శాశ్వతము = స్థిరమైనది, నిజపరచు = ఋజువుచేయు)

పుట్టపర్తికి చెందిన శ్రీ సత్యసాయి బాబా మానవ విలువలు నిండిన ఆధ్యాత్మిక బోధనలు చేస్తూనే ఉచిత సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు, పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, తాగునీటి ప్రాజెక్టులు ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. వారు స్థాపించిన ఆధ్యాత్మిక కేంద్రం లాంటి వాటికి వచ్చే చందాలు, ఇతర ఆదాయం సద్వినియోగం చెయ్యడానికి ఆయన చూపించిన మార్గము సర్వదా ఆచరణీయము. ఆ సంపదని పేర్చుకుంటూ పోతే, కాపలాదారుల మీద ఖర్చు, దొంగల మీద నిఘా, రకరకాల అవకతవకలు - వీటి గురించి చెప్పుకుంటూ మనం కాలక్షేపం చెయ్యాల్సి వస్తుంది. ఈ పద్యంలోని అంతరార్థం ఇదే.

మత సంస్థల (religious institutions) సంపదని ప్రజాహిత కార్యాల కోసమే ఖర్చు చెయ్యాలి. ఈ విధానమే సమాజానికి స్థిరమైనదని పుట్టపర్తి సాయిబాబా ఋజువు చేశారు.

కం. మన కవసరమా యారా
ధనలును ప్రార్థనల వంటి ధార్మిక చర్యల్
యొనరింపగ బాహ్యముగా,
యొనఁగూడదె యింటఁ జేయ నూరట మనకున్
జనుల కసౌకర్యముగా
తనరించని దేదియు ఫలిత మిడదె కు(సు)మతీ. 49

(ఆరాధన = పూజ, అర్చన = ఉపాసన, ప్రార్థన = వేఁడుట, చర్య = ఆచరణము, ఒనరించు = చేయు, బాహ్యము = వెలుపల, ఒనగూడు = సిద్ధించు, ఊరట = ఉపశమనం, తనరించు = చేయు, ఫలితము = ప్రయోజనము, ఇడు = ఇచ్చు)

ఆరాధనలు, ప్రార్థనల లాంటి ధార్మిక ఆచరణాలు బహిరంగంగా చెయ్యడం మనకి అవసరమా? ఇంట్లో చేస్తే మనకి ఉపశమనం సిద్ధించదా? ప్రజలకి అసౌకర్యంగా చేయనిది ఏదీ ప్రయోజనం ఇవ్వదా?

కం. జీవనమున లక్ష్యంబులు,
భావినిఁ గూర్చిన దిగుళ్ళు బాల్యపు స్మృతులుస్,
నావనిఁ జెప్పగ నేవియు
లేవను యద్వైతి స్థితిని, లేమియె? కు(సు)మతీ. 50

(లక్ష్యము = గుఱి, భావి = భవిష్యత్తు, దిగులు = భయము, బాల్యము = చిన్నతనము, స్మృతి = జ్ఞాపకము, అద్వైతి = జీవేశ్వరుల యభేదమును బోధించు వాడు, స్థితి = ఉనికి, లేమి = దారిద్ర్యము)

జీవితంలో లక్ష్యాలు, భవిష్యత్తును గురించిన భయాలు, చిన్నప్పటి జ్ఞాపకాలు, నావి అని చెప్పుకోడానికి ఏవీ లేవు అనే అద్వైతి ఉన్న పరిస్థితిలో లేమి ఏముంటుంది.

కం. అక్రమ గడనన లాలస
చక్రంబును త్రిప్పుటందు చతురత్వంబుస్
వక్రముగ సలుపు యోచన
లే క్రందుకొనిన పతనము లెసఁగును కు(సు)మతీ. 51

(అక్రమ = చట్టబద్ధం కాని, గడన = సంపాదన, లాలస = అధికమయిన కోరిక, చతురత్వము = నేర్పు, వక్రము = వంకరైన, సలుపు = చేయు, యోచన = ఆలోచన, క్రందుకొను = అతిశయించు, పతనము = పాటు, ఎసఁగు = కలుగు)

చట్టబద్ధం కాని సంపాదన అంటే అధికమయిన కోరిక, చక్రం త్రిప్పడంలో అంటే పరిస్థితులను శాసించడంలో నేర్పు, వంకరగా చేసే ఆలోచనలే ఎక్కువైతే పతనాలు కలుగుతాయి.

కం. అడరె కుటుంబ నియంత్రణ
బడులను రుసుములును చదువు వ్యయము పెరుగ, గం

పెడు పిల్లల(గందురె యిక,
హడలెత్తించెడి పథకము లనయమె? కు(సు)మతీ. 52

(అడరు = అతిశయించు, కుటుంబ నియంత్రణ = తక్కువ సంతానాన్ని కనడం ద్వారా కుటుంబాన్ని పరిమితం చేయటం, బడి = పాఠశాల, రుసుము = ఫీజు, వ్యయము = ఖర్చు, గంపెడు = మిక్కిలి, కను = ప్రసవించు, హడలు = భయము, పథకము = స్కీము, అనయము = ఆవశ్యకము)

పాఠశాలల్లో ఫీజులు చదువు కయ్యే ఖర్చు పెరిగిపోగా, కుటుంబ నియంత్రణ ఎక్కువైంది. ఎవ్వరూ ఇక ఎక్కువ మంది సంతానాన్ని కనరు. భయపెట్టే స్కీములు ఆవశ్యకమా?

కం. వెదకిన దొరకని దేమది?
యొదవిన గుర్తించ లేని దొక్క టదేదీ?
యెది నిలుపుకొనుట కష్టము?
తుది లేనిద దేది? ప్రేమ తొడరుటె, కు(సు)మతీ. 53

(వెదకు = అన్వేషించు, ఒదవు = లభించు, ఎది = ఏది, నిలుపుకొను = స్థిరపఱచుకొను, తుది = అంతము, తొడరు = కలుగు)

వెతికినా దొరకనిది ఏమిటి? దక్కినా గుర్తించ లేని ఆ ఒక్కటీ ఏది? ఏది స్థిరపఱచుకోవడం కష్టము? అంతం లేనిదైన అదేదీ? ప్రేమ కలగడమే.

కం. ఆకలి రుచిపచి యెరుగదు
కోకిల యెరుగదు తరువున గూడును కట్టస్
చాకలిది సందె యెరుగదు
దూకుడు పోకడ నెరుగదు, తొడరిన కు(సు)మతీ. 54

(తరువు = చెట్టు, సందె = సంధ్యా సమయం, దూకుడు = తొందరపాటు, వోకడ = ప్రవర్తనము, తొడరు = యత్నించు)

ప్రయత్నించినా కూడా, ఆకలికి రుచిపచి తెలియదు, కోకిలకి చెట్టు మీద గూడు ఎలా కట్టాలో తెలియదు (అందుకనే, కోకిలలు తమ గుడ్లను కాకి లేదా ఇతర చిన్న పక్షుల గూళ్లలో పెడతాయి), చాకలి స్త్రీకి సాయంకాలం తెలియదు (ఎందుకంటే, ఉదయం నుండి బట్టలు ఉతికి ఆ తరువాత వాటిని ఆరబెట్టడంలో నిమగ్నమై చీకటి పడబోతోందనే ధ్యాస లేకుండా ఉంటుంది), దూకుడు ప్రవర్తన అంటే ఏమిటో ఎరుగదు.

కం. తనకున్నదియే చాలని,
తన పాండిత్యం బసదని, దాతృత్వమునస్
మనుటయె మనుగడ యనుచుస్,
తనివిని జీవించు వారె, ధన్యులు కు(సు)మతీ. 55

(అసదు = అల్పము, దాతృత్వము = దానముచేయు గుణము, మను = జీవించు, మనుగడ = జీవనము, తనివి = తృప్తి, ధన్యుడు = కృతార్థుడు)

తనకి ఉన్నదే చాలని, తనకు తెలిసింది అల్పమని, దానగుణంతో జీవించడమే జీవనమని అంటూ, తృప్తితో జీవించే వారే కృతార్థులు.

కం. ప్రచురత యుండని పూజయు,
విచికిత్సను మరచి గుప్త వితరణము లొన
ర్చుచు ప్రజకుస్ సాయము, చే
యుచు జీవించు జనపదుఁడె యోగ్యుడు, కు(సు)మతీ. 56

(ప్రచురత = ప్రచారము, విచికిత్స = సంశయము, గుప్త = దాఁచఁబడినది, వితరణము = దానము, ఒనర్చు = చేయు, జనపదుఁడు = మనుష్యుఁడు, యోగ్యుడు = మంచివాడు)

ఆర్భాటం, ప్రచారం, గొప్పలకు పోవడం లాంటివి లేని పూజాపునస్కారాలను నా చిన్నప్పటి నుంచి చూడలేదు. అహంకారం తగ్గించడానికే పూజలుంటే, ఆ లక్ష్యానికి విరుద్ధంగా ఇవన్నీ పనిచేస్తాయి. పైపెచ్చు గర్వాన్ని పెంచుతాయి. అలా ఉండకూడదని చెప్పడమే ఈ పద్యం ఉద్దేశ్యం.

ప్రచారం లేని పూజ, సంకోచం మరచిపోయి గుప్తదానాలు చేస్తూ ప్రజలకు సాయం చేస్తూ జీవించే మనిషే మంచివాడు.

కం. ఆరాధించరు నాస్తికు
లారాధన సలుపు వారు యాస్తికు లనుచుస్
బేరీజు తగదు యాస్తికు
లారాధించక మనుటయె యరుదా కు(సు)మతీ. 57

(ఆరాధించు = పూజించు, నాస్తికుడు = ఈశ్వరుడు లేడని వాదించేవాడు, ఆరాధన = పూజ, సలుపు = చేయు, ఆస్తికుడు = భగవంతుఁడున్నాఁడని నమ్మువాఁడు, బేరీజు = అంచనా, మను = జీవించు, అరుదు = వింత)

Classifying theists and atheists based on the habit of worship is unacceptable. నాస్తికులు పూజ చెయ్యరనీ, పూజ చేసే వాళ్ళు ఆస్తికులనీ అంచనా వెయ్యడం సరి కాదు. ఆస్తికులు పూజ చెయ్యకుండా జీవించడం వింతా?

కం. కొందరి చెడ్డ గుణంబుల
నందరి కా వర్గమందు యాపాదించస్

గందుము యెందరినో, మన
ముందటె యిట్టివి జరుగుట ముదమా? కు(సు)మతీ. 58

(వర్గము = సజాతీయ సమూహము, ఆపాదించు = లేనివి ఉన్నట్లుగా అంటగట్టి చెప్పు, కను = చూచు, ముందట = ఎదుట, ముదము = సంతోషము)

తెలిసిన ఒకరో ఇద్దరో సరిగ్గా లేకపోతే వాళ్ళ కులం / జాతి / ఊరి వాళ్ళని అందరిని ఉద్దేశించి దూషించడం మనం చాలా సార్లు చూసి ఉంటాము. అది తప్పని చెప్పడమే ఈ పద్యం ఉద్దేశ్యం.

కొందరి చెడు లక్షణాలు ఆ వర్గము లోని అందరికీ ఆపాదిస్తుండగా ఎందరినో చూస్తాము. మన ఎదుటే ఇలాంటివి జరగడం సంతోషమా?

కం. తన వారు తప్పుఁ జేసిన
వెనుకేసుకు వచ్చు వారు పెక్కురు యుండన్
తన వారు మంచిఁ జేసిన
విన నొప్పని వారు యుంట వింతయె కు(సు)మతీ. 59

(వెనుకేసుకు వచ్చు = సమర్థించు, పెక్కురు = అనేకులు, ఒప్పు = సమ్మతించు, ఉంట = ఉండుట, వింత = ఆశ్చర్యము)

తన వాళ్ళు తప్పు చేస్తే సమర్థించే వాళ్ళు చాలా మంది ఉండగా, తన వాళ్ళు మంచి చేస్తే విని సమ్మతించని వాళ్ళు ఉండడం ఆశ్చర్యమే.

కం. నిన్నెల్లప్పుడు నినుగా
కన్నది కన్నట్లుఁ గాక, కల్లల వ్యాప్తిన్
మిన్నగ పన్నెడి ప్రజ కది,

చెన్నుగ వ్యక్తిత్వ హింసఁ జేయుటె కు(సు)మతీ. 60

(కను = చూచు, కల్ల = అబద్ధము, వ్యాప్తి = ప్రచారము, మిన్న = శ్రేష్ఠము, పన్ను = కలుగఁజేయు, చెన్ను = అందము)

సాధారణంగా ఒకరి సామర్థ్యము ఇంకొకరు ఒప్పుకోరు. కానీ, ఎవరి బలహీనత గురించైనా కథలు కథలుగా చెప్పుకోవడం అందరికీ చాలా ఇష్టమే. ఈ మనస్తత్వంతోనే కొంతమంది మన గురించి ఇతరులకు వక్రీకరించి చెబుతూ ఉంటారు. ఈ పద్యం ఆ విషయం గురించే.

నిన్ను ఎప్పుడూ నిన్నుగా, చూసింది చూసినట్లుగా కాకుండా, అబద్ధాల ప్రచారం ఎక్కువగా కలగజేసే ప్రజలకు, అది అందంగా వ్యక్తిత్వ హింస (Character assassination) చెయ్యడమే కదా.

కం. తోఁచిన వేళల నెపుడో
తూఁచి నటుల సత్తుఁ బలుకు తుంటరి వాక్కుల్
తోఁచును కల్లలుగానే,
దాచిన దాగని నిజ మిది తలపగ కు(సు)మతీ. 61

(తోఁచు = మనసున ఏర్పడు, తూఁచు = తూనికవేయు, సత్తు = సత్యము, తుంటరి = దుష్టుడు, వాక్కు = మాట, కల్ల = అబద్ధము, దాచు = మఱుగుపఱచు, తలచు = ఆలోచించు)

ఎప్పుడూ అబద్ధాలు చెబుతూ, అప్పుడప్పుడూ మాత్రమే నిజం చెప్పే అలవాటు ఉన్న వాళ్ళు, ఎప్పుడన్నా నిజం చెబితే ఎవరూ నమ్మరు. ఈ పద్యంలో ఆ విషయమే చెప్పబడింది.

తోచినప్పుడు ఎప్పుడో తూచినట్లుగా కొద్దికొద్దిగా నిజం మాట్లాడే దుష్టుడి మాటలు అబద్ధాలుగానే అనిపిస్తాయి. ఆలోచిస్తే, దాచినా దాగని సత్యం ఇది.

కం. పెరిగిన వాతావరణము
మరచు కృతఘ్నులు పలువురు, మరువక వివరం
బరయు కృతజ్ఞులు కలరీ
ధరణిని, వైవిధ్య మివ్విధమ్మురా! కు(సు)మతీ. 62

(మరచు = మరిచిపోవు, కృతఘ్నుఁడు = చేసిన మేలు మఱచువాఁడు, పలువురు = అనేకులు, వివరము = వివరణము, అరయు = విచారించు, కృతజ్ఞుడు = చేసిన మేలు తలచువాడు, ధరణి = భూమి, వైవిధ్యము = అనేక విధములుగా నుండుట)

Some people do not want to look back to remember where they have come from. పెరిగిన వాతావరణం మరిచిపోయే కృతఘ్నులు చాలా మంది. మరిచిపోకుండా వివరాలు విచారించే కృతజ్ఞులు కూడా ఈ భూమి మీద ఉన్నారు. వైవిధ్యం (diversity) ఈ విధంగా ఉంటుంది.

కం. మంచి తల పెవరి కైన జ
నించు ననిన సమ్మతించ నేరని వారే
వంచన నైనను తాము వ
చించు నదియె మంచి యంచుఁ జెప్పరె కు(సు)మతీ. 63

(తలపు = ఆలోచన, జనించు = కలుగు, నేరని = చెయ్యలేని, వంచన = మోసం, వచించు = చెప్పు)

రాజకీయ వాతావరణంలో అధికార పక్షం, ప్రతిపక్షం అన్న రెండు వర్గాలు ఉంటాయి. ఒక పక్షానికి తట్టిన ఆలోచన, మంచిదైనా చెడ్డదైనా రెండవ పక్షానికి నచ్చదు. అసలు, అవతలి పక్షానికి మంచి ఆలోచన అప్పుడప్పుడైనా రావచ్చన్న విషయమే ఏ పక్షమూ ఒప్పుకోదు.

మంచి ఆలోచన ఎప్పుడూ మనకే వస్తుంది అని వాళ్ళ భావన. ఈ పక్షపాతం మనం నిజ జీవితంలో కూడా చూస్తూనే ఉంటాము. ఈ పద్యంలో ఉన్న భావన అదే.

మంచి ఆలోచన ఎవరికైనా వస్తుంది అంటే ఒప్పుకోని వాళ్ళే మోసంతో ఐనా తాము చెప్పేదే మంచి అంటూ చెప్పరా?

కం. చవటకు విద్యాగంధము
జవరాలికి ముసలితనపు శ్రమలును వెతలుస్
యవివేకి యెదుట కవనము
చెవిటికి శంఖధ్వని వలెఁ జెల్లును కు(సు)మతీ. 64

(చవట = అప్రయోజకుడు, విద్యాగంధము = విద్య యొక్క జ్ఞానం, జవరాలు = యువతి, శ్రమ = కష్టము, వెత = దుఃఖము, అవివేకి = తెలివిలేనివాఁడు, కవనము = కవిత్వము, చెవిటి = చెవిటివాఁడు, చెల్లు = ప్రవర్తిల్లు)

అప్రయోజకునికి విద్యాగంధము, యువతికి ముసలితనంలో కలిగే కష్టాలు దుఃఖాలు, తెలివిలేనివాఁడి ఎదురుగా కవిత్వము, చెవిటివాఁడికి శంఖధ్వని లాగా ఉంటాయి.

కం. ఎనలేని స్నేహభావము
తన వారిని చూచు నట్టి తఱి, యితరు లనస్
యనుమానము యవగణనా?
తనరు మమత్వ మన యిదియె, తథ్యము కు(సు)మతీ. 65

(ఎన = పోలిక, తఱి = సమయము, అనుమానము = సందేహము, అవగణన = తిరస్కారము, తనరు = మించు, మమత్వము = నాది యను భావము, తథ్యము = సత్యము)

తన వాళ్ళని చూసే సమయంలో సాటిలేని స్నేహభావమున్నూ, ఇతరులు అంటే అనుమానం తిరస్కారమూనా? మించిపోయిన మమత్వం అంటే నిజంగా ఇదే.

కం. గాడిదకు వెనుక నిలుచుట
చాడీలను చెప్పువారి సరసన మనుటల్
నీడనుఁ గని భయ మందుట
వాడుకలను మరచు చుంట పాత్రమె కు(సు)మతీ. 66

(చాడీ = కొండెము, సరసన = ప్రక్కన, మను = జీవించు, వాడుక = అలవాటు, పాత్రము = సమంజసము)

గాడిదకి వెనకాల నుంచోవడం, చాడీలు చెప్పే వాళ్ళ ప్రక్కన జీవించడం, నీడను చూసి జడుసుకోవడం, అలవాట్లను మరచిపోవడం సమంజసమా.

కం. మీనములు జలము విడచుట,
మానము తాకట్టుపెట్టి మనుటయు, పుడమిన్
బో నొత్తి చేయు సామును,
శ్వానము పని ఖరము సలుప పాత్రమె కు(సు)మతీ. 67

(మీనము = మత్స్యము, జలము = నీరు, మానము = గౌరవము, తాకట్టుపెట్టు = కుదువపెట్టు, మను = జీవించు, పుడమి = నేల, పోనొత్తు = విడుచు, సాము = వ్యాయామము, శ్వానము = కుక్క, ఖరము = గాడిద, సలుపు = చేయు, పాత్రము = యోగ్యము)

చేపలు నీటిని వదిలిపెట్టడం, గౌరవం తాకట్టు పెట్టి జీవించడం, నేల విడిచి సాము చెయ్యడం, కుక్క పని గాడిద చెయ్యడం సరియైనవా?

కం. సూకరముఁ బోలె నుంటివి
శూకపు మంత్రంబు నీకు స్ఫురణకు రాదా
కేకటగా యిట్లనుటల్
మోకాలికి బోడిగుండు ముడియే కు(సు)మతీ. 68

(సూకరము = పంది, పోలె = వలె, శూకము = తేలుకొండి, స్ఫురణ = తోఁచుట, కేకట = పరిహాసము)

పంది లాగా ఉన్నావు తేలు మంత్రం నీకు తోఁచదా. ఈ విధంగా పరిహాసంగా అనడం మోకాలికి బోడిగుండుకి ముడి వెయ్యడమే కదా.

కం. మేమున్న స్థితికి నటు నిటు
యేమున్ననుఁ గాని మా కయిష్టం బనుచుస్
సోమరులు వసించెడి యే
ధామము నందైనను క్షతి తప్పదు కు(సు)మతీ. 69

(సోమరి = బద్దకము కలవాడు, వసించు = నివసించు, ధామము = ఇల్లు, క్షతి = నాశము)

మేము ఉన్న పరిస్థితికి అటూ ఇటూగా ఏమున్నా గానీ మాకు ఇష్టం లేదు అంటూ సోమరులు నివసించే ఏ ఇంట్లోనైనా నాశము తప్పదు.

కం. ప్రతి విషయము నందు తమను
యితరులతో పోల్చు కొనుట నెన్నగ తప్పే
సతమును నిన్నటి నేను
న్నతి సాధించితిని నేడనఁ దగును కు(సు)మతీ. 70

(ఎన్ను = గ్రహించు, సతము = ఎల్లప్పుడు, ఉన్నతి = వృద్ధి, సాధించు = శ్రమతో నెఱవేర్చు, నేడు = ఈరోజు, అనఁదగు = అనవచ్చు)

గ్రహిస్తే, ప్రతి విషయంలోను తమని వేరే వాళ్ళతో పోల్చుకోవడం తప్పు. ఎప్పుడూ నిన్నటి నేను ఈ రోజు వృద్ధి సాధించానని అనడం సరియైనది. అంటే, నిన్నటి నేనుతో ఇవాల్టి నేను పోటీ పడడం సరియైనది.

కం. ఎద్దు వలె పెంచి కుక్కను
ముద్దుగ నది యలసిపోవు మొరిగిన యనుటల్
బద్దక మున్న కుమారుల
మొద్దులనుచు తిట్టగ నొక మొగియే కు(సు)మతీ. 71

(బద్దకము = ఆలశ్యము, మొద్దు = మూర్ఖుడు, మొగి = విధము)

కుక్కను ఎద్దు లాగా ముద్దుగా పెంచి అది మొరిగితే అలిసిపోతుంది అనడాలు బద్దకం ఉన్న కొడుకులను మూర్ఖులని తిట్టే ఒక విధమే.

కం. సూరన్నన సుఖవాసియె
పేరన్నన నీ సుతులను పెద్ద తనయుడే
ఓరయ్య కోళ్ళగంపను
ఔరసులకు యెత్త వలదు యనరే కు(సు)మతీ. 72

(సుఖవాసి = సుఖము గలవాఁడు, అయ్య = తండ్రి, ఔరసుడు = కొడుకు)

మారుతున్న కాలాన్ని సూచించడానికి పెల్లెల్లో తరచుగా వినబడే ఒక సామెత లాంటి వాక్యము: సూరన్న సుఖవాసి, పేరన్న పెద్దకొడుకు, అయ్య కెత్తరా కోళ్ళగంప, అని. అదే ఈ పద్యంలోని భావన.

కం. కొఱగాని వాడు యుండడు
కొఱగామినిఁ గూడ మంచి కొంచెం బుండుస్
పెఱవారి యందు లోపము
లొఱటుల వలె దేవులాడ యుచితమె కు(సు)మతీ. 73

(కొఱగానివాఁడు = అప్రయోజకుఁడు, కొఱగామి = పనికిమాలినతనము, పెఱవాడు = ఇతరుడు, ఒఱటు = దుష్టుఁడు, దేవులాడు = వెదకులాడు, ఉచితము = యుక్తము)

అప్రయోజకు డంటూ ఎవడూ ఉండడు. పనికిమాలినతనంలో కూడా మంచి కొద్దిగా ఉంటుంది. ఇతరులలో లోపము దుష్టుడి లాగా వెదకులాడడం ఉచితమేనా?

కం. కొంచెపు బుద్ధులుఁ గలిగిన
వంచకులకు కలసివచ్చుఁ బరిమితముగనే
మంచిగ నుండెడి వారికి
యంచితముగ కీర్తి దక్కు టగుపడు కు(సు)మతీ. 74

(కొంచెపుబుద్ధి = అల్పపు బుద్ధి, వంచకుడు = మోసగాడు, పరిమితము = కొద్దిగా, అంచితము = సమ్మానితము, దక్కు = లభించు, అగుపడు = కనబడు)

అల్పమైన బుద్ధులు ఉన్న మోసగాళ్ళకు పరిమితంగా కలిసివస్తుంది. మంచిగా ఉండేవాళ్ళకి సమ్మానించబడే విధంగా కీర్తి లభించడం కనబడుతుంది.

కం. కన్యకు రూపం బిష్టము,
ధన్య పితృయుగమున కింపు ధనమును చదువుల్,
యన్యుల కితవు కుడుపు, దౌ
ర్జన్యము మనువున వకీళ్ళ రసనమె కు(సు)మతీ. 75

(రూపము = సౌందర్యము, ధన్య = అదృష్టవంతులైన, పితృయుగము = తల్లిదండ్రులు, ఇంపు = ఇష్టము, అన్యులు = ఇతరులు, ఇతవు = ఇష్టము, కుడుపు = భోజనము, దౌర్జన్యము = చెడ్డతనము, మనువు = వివాహము, వకీలు = న్యాయవాది, రసనము = విందు)

"కన్యా వరయతే రూపం, మాతా విత్తం, పితా శ్రుతం, బాంధవాః కులమిచ్ఛంతి, మృష్టాన్న మితరే జనాః" అన్న శ్లోకం వరుడి వివాహ యోగ్యత గురించి వధువు, ఆమె తల్లిదండ్రులు, ఇతరులు ఎలా ఆలోచిస్తారో తెలుపుతుంది. ఈ పద్యంలోని భావన కూడా అదే కానీ న్యాయవాదుల పాత్ర కూడా అందులో చేర్చబడింది.

కన్యకి సౌందర్యం ఇష్టం. అదృష్టవంతులైన తల్లిదండ్రులకు డబ్బు చదువు ఇష్టం. ఇతరులకి భోజనం ఇష్టం. వివాహంలో దౌర్జన్యం న్యాయవాదులకి విందే.

కం. బెల్లమును జీలకర్రను
యల్లుని కాకు నతికి శిర మందుంచ నగుస్
పెళ్ళి, పిదప వరుకుస్ రా
జిల్లెడి బట్టతల రాదె, చెప్పుము కు(సు)మతీ. 76

(ఆకు = తమలపాకు, అతుకు = అతికించు, శిరము = తల, పిదప = పిమ్మట, వరుడు = పెండ్లికుమారుడు, రాజిల్లు = ప్రకాశించు)

పెళ్ళిళ్ళలో ముహూర్తానికి బెల్లం జీలకర్ర తమలపాకులో అతికించి పెండ్లికుమారుని తల మీద ఉంచితే పెళ్ళి అవుతుంది. తరువాత, పెండ్లికుమారునికి మిలమిలా మెరిసే బట్టతల రాదా, చెప్పు.

కం. బాలిశుని శాస్త్ర పాండితి
పీలికలను కలిపి కుట్టి పేనెడి మోకున్
సాలీడు యల్లు యూయల
తేలికగా కానుపట్టు తెలియుము కు(సు)మతీ. 77

(బాలిశుఁడు = మూర్ఖుఁడు, పాండితి = పాండిత్యము, పీలిక = వస్త్రములోనగువాని ముక్క, పేను = పురిబెట్టు, మోకు = లావుత్రాడు, సాలీడు = సాలెపురుగు, అల్లు = నేయు, ఊయల = ఉయ్యాల, తేలిక = చులకన, కానుపట్టు = కనబడు)

మూర్ఖుని శాస్త్ర పాండిత్యము, గుడ్డముక్కలు కలిపి కుట్టి పేనే మోకు, సాలెపురుగు నేసే ఉయ్యాల చులకనగా కనిపిస్తాయి, తెలుసుకో.

కం. కల్లలుఁ జెప్పెడి వారని
తెల్లంబవ నెపుడుఁ గూడ తెక్కలిఁ గలదే
యొల్లక యొల్లక యున్నను
యెల్లప్పుడు నిజము దాచు టెడరే కు(సు)మతీ. 78

(కల్ల = అబద్ధము, తెల్లము = స్పష్టము, తెక్కలి = ప్రమాదము, ఒల్లు = ఇష్టపడు, ఎడరు = విపత్తు)

నేను అబద్ధాలు చెప్పను కానీ నిజమేమిటో మాత్రం చెప్పను అని అనే వాళ్ళని చాలా సందర్భాలలో చూసి ఉంటాము. అలాంటి వారు అబద్ధాలు చెప్పే వాళ్ళకన్నా ప్రమాదకరమైన వ్యక్తులు అన్నది ఈ పద్యం లోని ఆవేదన.

అబద్ధాలు చెప్పేవారని స్పష్టమయితే ఎప్పుడూ కూడా ప్రమాదం ఉంటుందా? ఇష్టపడ్డా ఇష్టపడకపోయినా ఎప్పుడూ నిజం దాచడం ఆపదే.

కం. పలుకుల నిజమేఁ జెప్పెడి
తలకక కల్లలు వచించు తాహతు కన్నన్
యొలసి యథార్థము దాచుటె
తలచిన నతి కష్టమయ్య తాళుము కు(సు)మతీ. 79

(పలుకు = మాట, తలకు = భయపడు, కల్ల = అబద్ధము, వచించు = చెప్పు, తాహతు = శక్తి, ఒలయు = కోరు, యథార్థము = నిజము, తలచు = ఆలోచించు, అతి = మిక్కిలి, తాళు = సహించు)

మాటల్లో నిజం చెప్పేటి, భయపడకుండా అబద్ధాలు చెప్పేటి శక్తి కన్నా కోరి నిజం దాచడం ఆలోచిస్తే చాలా కష్ట మయ్యా. సహించాలి.

కం. ఎప్పటి కెయ్యది తగునో
యప్పటి కాపల్కు పలుకు యధములు యతిగా
మెప్పులు మెండుగ పొందుట
చొప్పడు చున్నట్టి యూరు చొచ్చకు కు(సు)మతీ. 80

(తగు = యుక్తమగు, పల్కు = మాట, పలుకు = మాటాడు, అధముడు = నీచుడు, అతి = అధికము, మెప్పు = పొగడ్త, మెండు = అధికము, చొప్పడు = కలుగు, చొచ్చు = ప్రవేశించు)

ఎప్పటి కేది సరియైనదో అప్పటికి ఆ మాట మాట్లాడే నీచులు ఎక్కువగా మెప్పులు పొందడం తటస్థిస్తున్న ఊరు ప్రవేశించకు.

కం. దెప్పిన మానక యప్పులు
కుప్పలుగాఁ జేసి పప్పుకూడు భుజింపన్,
తిప్పలుఁ దప్పవు, దక్కవు
మెప్పులు, యనుభవమె మనకు మిగులును, కు(సు)మతీ. 81

(దెప్పు = నిందించు, మాను = విడుచు, కుప్ప = రాశి, తిప్పలు = కష్టములు, దక్కు = లభించు, మెప్పు = పొగడ్త)

తిట్టినా మానకుండా ఎక్కువగా అప్పులు చేసి పప్పుకూడు తింటే కష్టాలు తప్పవు. మెప్పులు లభించవు. మనకు అనుభవమే మిగులుతుంది.

కం. అడియాసల జీవించకు
మిడిగొనఁ గని పసిడి యని భ్రమించకు, సామా
న్యుఁడ నని తెగువ విడకు, గడ
గడలాడకు నీడ యెదుటఁ గదలగ కు(సు)మతీ. 82

(అడియాస = వ్యర్థమైన ఆశ, మిడిగొను = మెఱయు, కను = చూచు, పసిడి = బంగారము, భ్రమించు = అపోహపడు, తెగువ = సాహసము, విడు = విడుచు, గడగడలాడు = వణకు)

వ్యర్థమైన ఆశలతో జీవించకు. మెరవడం చూసి బంగారం అని అపోహపడకు. సామాన్యుణ్ణి అనుకొని సాహసం వీడకు. నీడ ఎదురుగా కదలడానికి వణకకు.

కం. అడిగిన అన్నము పెట్టని,
చెడు తిరుగుడు తిరుగుచున్న క్షేత్రజు నెపుడా
అడివెట్టని, జనయిత్రిని
వడిగా వర్జింపఁ గొంకు వలదుర, కు(సు)మతీ. 83

(క్షేత్రజుడు = కుమారుడు, ఆఅడివెట్టు = నిందమోపు, జనయిత్రి = తల్లి, వడి = త్వరితము, వర్జించు = విడుచు, కొంకు = సంకోచము, వలదు = వద్దు)

తోటకూర నాడే మందలించి ఉంటే, ఇప్పుడీ తిప్పలు, తలనొప్పులు ఉండేవా అని అంటారు, కొడుకును వెనకేసుకొస్తున్న తల్లిని చూసి. పద్యంలో కూడా ఇంచుమించు ఇదే చెప్పబడింది. అడిగినా అన్నం పెట్టనటువంటి, చెడు తిరుగుడు తిరుగుతున్నా కొడుకును తిట్టని, అమ్మను త్వరగా వదిలిపెట్టడానికి సంకోచం వద్దు.

కం. అప్పడుగు వాని నెయ్యము,
చెప్పుటకే యున్న హితము, చెల్లాటమ్ముల్
నిప్పులతో చర్లాడుట,
చప్పున విడనాడి మనుటె చాతురి, కు(సు)మతీ. 84

(అప్పు = ఋణము, నెయ్యము = స్నేహము, హితము = మంచి, చెల్లాటము = ఆట, చర్లాడు = ఆటాడు, చప్పున = వెంటనే, విడనాడు = వదలిపెట్టు, మను = జీవించు, చాతురి = నేర్పు)

అప్పు అడిగేవాడితో స్నేహం, చెప్పడానికి మాత్రమే ఉన్న మంచి, నిప్పులతో ఆటలాడుకోవడం వెంటనే వదలిపెట్టి జీవించడమే చాతుర్యము.

కం. మీఱకుమీ నీ హద్దులు
పాఱకుమీ పామరు వలె బాధ్యత లన్నస్

చేరకుమీ చెడు సంగతి
కోరకుమీ బాధ పెంచు కోర్కెలు కు(సు)మతీ. 85

(మీఱు = అతిక్రమించు, పాఱు = పరుగెత్తిపోవు, పామరుఁడు = తెలివిలేనివాఁడు, చేరు = సమీపించు, సంగతి = సాహచర్యము)

నీ హద్దులు మీరకు. తెలివిలేనివాఁడి లాగా బాధ్యత లనంగానే పారిపోవద్దు. చెడు సావాసాల్లో చేరకు. బాధను పెంచే కోరికలు కోరకు.

కం. అపకారికి యపకారము
యపకర్తల కుండు నట్టి యలవాటు సుమీ,
ఉపకారికి యపకారము
త్రప వీడిన వాడె చేయు, తథ్యము కు(సు)మతీ. 86

(అపకర్త = అపకారము చేయువాఁడు, త్రప = సిగ్గు, వీడు = త్యజించు, తథ్యము = సత్యము)

అపకారికి అపకారము అన్నది అపకారము చేసేవాళ్ళకి ఉన్న అలవాటు సుమా. ఉపకారికి అపకారము మాత్రము సిగ్గు వదిలేసిన వాడే చేస్తాడు. ఇది నిజం.

కం. కులమో మతమో గోత్రమొ
నెలవో గుర్తింపు మాకని తెలుపు మనుజుల్
బలహీనులు సంఘంబున,
యలవాట్లను మార్చుకొనుటె యనువగు, కు(సు)మతీ. 87

(గోత్రము = వంశము, నెలవు = వాసస్థానము, అనువు = యుక్తము)

మాది ఈ కులము, ఈ మతము, ఈ గోత్రము, ఈ ప్రాంతము అని తమ గుర్తింపు కోసం చెప్పే మనుషులు సంఘంలో బలహీనులు. ఈ అలవాట్లు మార్చుకోవడమే సరియైనది.

కం. నా మగని భవిత యేమని
స్వామిని జ్యోతిషు నడుగగ, పరికించి సతిస్
నీ మగ నేల్నాటిశని వి
రామ మెరుగక పొదివె ననె రగులుచు కు(సు)మతీ. 88

(భవిత = జరుగవలసినది, స్వామిని = భార్య, పరికించు = పరీక్షించు, సతి = భార్య, ఏల్నాటిశని = చెడ్డకాలం, విరామము = విశ్రాంతి, పొదువు = క్రమ్ము, రగులు = మంటయెత్తు)

మా ఆయన భవిష్యత్తు ఏమిటి అని భార్య జ్యోతిష్కుణ్ణి అడగగా, ఆ భార్యను పరీక్షించి (ఎగాదిగా చూసి) మీ ఆయనను ఏల్నాటిశని విరామం లేకుండా క్రమ్మింది అని మండిపడుతూ అన్నాడు. అంటే, ఆ శనివి నువ్వే అని పరోక్షంగా చెప్పడం అన్న మాట.

కం. వినుటకు యోరిమి తక్కువ
విని నంతనె యాకళించు విబుధులు నరుదే
విను వీనులు రెండైనను
యనుటను విను టెపుడుఁ గూడ యర్ధమె కు(సు)మతీ. 89

(ఓరిమి = ఓర్పు, ఆకళించు = తెలిసికొను, విబుధుడు = విద్వాంసుడు, అరుదు = దుర్లభము, వీనులు = చెవులు, అర్ధము = సగము)

వినడానికి ఓర్పు తక్కువ. వినగానే అర్థం చేసుకునే విద్వాంసులు అరుదే. వినే చెవులు రెండే ఐనా చెప్పడంలో వినడం ఎప్పుడూ సగమే.

కం. భ్రష్టుని పశ్చాత్తాపము
దుష్టుడగు యతని సఖునికి తోషం బిడునే
క్రోష్టువగు కర్ణు వలె సం
తుష్టుండగు మారకున్న తోఁపిక కు(సు)మతీ. 90

(భ్రష్టుడు = నీచుడు, పశ్చాత్తాపము = జరిగిన దానికి తరువాత చింతించుట, దుష్టుడు = దుష్టబుద్ధి, సఖుడు = స్నేహితుడు, తోషము = సంతోషము, ఇడు = ఇచ్చు, క్రోష్టువు = నక్క, సంతుష్టుడు = తృప్తుడు, తోఁపిక = తలఁపు)

మహాభారతంలో దుర్యోధనుడు కర్ణుడు మిత్రులు. పరిస్థితుల ప్రభావం వల్ల ఎప్పుడైనా దుర్యోధనుడికి పశ్చాత్తాపం కలిగితే, కర్ణుడు అక్కడకి వచ్చి ఏదో విధంగా అతడిని చెడగొట్టి మునపటి లాగా ఉండేటట్లు చేస్తూ ఉంటాడు. ఈ పద్యంలో విషయం అదే.

నీచుని పశ్చాత్తాపము దుష్టుడైన అతని మిత్రునికి సంతోషం ఇస్తుందా? నక్కయైన కర్ణుడి లాగా ఆలోచన మారకుండా ఉంటే తృప్తుడవుతాడు.

కం. ఇప్పటి కప్రస్తుతమని
యెప్పటి కప్పుడు ప్రతి పని కేదో వంకన్
చెప్పక గడువిచ్చు నపుడు
తప్పక చీవాట్లు నీకుఁ దగులును కు(సు)మతీ. 91

(అప్రస్తుతము = అప్పటి సందర్భమునకు సంబంధింపనిది, వంక = సాకు, గడువు = వాయిదా, చీవాట్లు = తిట్లు)

ఇప్పటికి అప్రస్తుతం అంటూ ఎప్పటి కప్పుడు ప్రతి పనికీ ఏదో వంక పెట్టి ముందు చెప్పకుండా గడువు ఇచ్చేటప్పుడు తప్పకుండా నీకు తిట్లు తగులుతాయి.

కం. ఎచ్చటనో నుదయించితి
నెచ్చటనో విద్య నేర్చి యెందరొ సాయం
బిచ్చిన మీదట యీ స్థితి
కొచ్చితి నన్న తలపుంట యుక్తము కు(సు)మతీ. 92

(ఉదయించు = పుట్టు, తలపు = ఆలోచన, యుక్తము = తగినది)

ఎక్కడో పుట్టాను, ఎక్కడో విద్య నేర్చుకుని ఎందరో సహాయం అందిచ్చిన పిదప ఈ స్థితికి వచ్చాను అన్న ఆలోచన ఉండడం సరియైనది.

కం. ఎపుడు గడించిన సంపద
నపుడే వ్యయపఱచు నట్టి యలవాటు నినుస్
యపరాధిగ నిలబెట్టును,
తపనను పెంచును, పతనము తథ్యము, కు(సు)మతీ. 93

(గడించు = సంపాదించు, సంపద = కలిమి, వ్యయపఱచు = ఖర్చుపెట్టు, అపరాధి = నేరము చేసినవాడు, తపన = ఉత్కంఠ, పతనము = నాశనము, తథ్యము = సత్యము)

ఎప్పుడు సంపాదించిన కలిమిని అప్పుడే ఖర్చుపెట్టే టటువంటి అలవాటు నిన్ను నేరం చేసిన వాడిగా నిలబెడుతుంది. తపన పెంచుతుంది. కచ్చితంగా నాశనం తప్పదు.

కం. తొలుతను మంచిగఁ దోచిన
చెలిమి తుదకు హాని సలుపు చెడువారి కడస్,
వెలుగు నదియె సుజనుల చెం
గలి తుది వరకును నిలిచి, నికమ్మిది కు(సు)మతీ. 94

(తొలుత = మొదట, చెలిమి = స్నేహము, తుదకు = చివరకు, హాని = కీడు, సలుపు = చేయు, కడ = సమీపము, వెలుగు = ప్రకాశించు, సుజనుఁడు = మంచి మనుష్యుఁడు, చెంగలి = సమీపము, నికము = నిజము)

చెడ్డవారి దగ్గర మొదట్లో మంచిగా అనిపించిన స్నేహం చివరకు కీడు చేస్తుంది. అదే మంచి వాళ్ళ దగ్గరైతే చివరిదాకా నిలిచి వెలుగుతుంది. ఇది నిజం.

కం. ఇప్పటి కిది యనుకూలము
తప్పక మన మిటులె చేయఁ దగునని తలపన్
నప్పును ముప్పు లెదుర్కొన
యెప్పుడు నది కుదర దనుచు యెరుగుము కు(సు)మతీ. 95

(తలచు = అనుకొను, నప్పు = సరిపోవు, ముప్పు = విపత్తు, ఎదుర్కొను = జయించు, కుదురు = అనుకూలమగు)

ఇప్పటికి ఇది అనుకూలం, తప్పకుండా మనం ఇలాగే చేస్తే మంచిది, అని అనుకోవడం విపత్తులను జయించడానికి సరిపోతుంది. ఎప్పటికీ అదే అనుకూలమవదు అని తెలుసుకో.

కం. వైవాహిక సంబంధము
కావలె నను మాటఁ బోయి కలసి యొకింటన్
జీవించుట మొదలయ్యెను
యే విధముగ వారసత్వ మేర్పడు కు(సు)మతీ. 96

(వైవాహిక = వివాహంతో ముడిపెట్టబడిన, వారసత్వము = ఆస్తి మొదలగు వానిలో వంశపరంపరగా వచ్చు హక్కు)

What will be the rights of children born out of live-in relationships? వివాహ సంబంధము కావాలి అన్న మాట పోయి కలిసి ఒకే ఇంటిలో జీవించడం మొదలయ్యింది. వారసత్వము ఎట్లా ఏర్పడుతుంది?

కం. గోటిని పోయెడి దానిఁ గు
ఠాటంకము చేతఁ బోనడచు టన్నటులే
మాటను సర్దుకొనక పో
ట్లాటకు దిగుటేల యంచు నరయుము కు(సు)మతీ. 97

(గోరు = అల్పము, కుఠాటంకము = గొడ్డలి, పోనడచు = గిట్టించు, సర్దుకొను = సవరించుకొను, అరయు = తెలియు)

గోటితో పోయేదాన్ని గొడ్డలితో గిట్టించుట అన్నట్లే మాటను సవరించుకొనకుండా కలహానికి దిగడం ఎందుకు అని తెలుసుకో.

కం. తన కేదో యన్యాయము
తన కెపుడేదో యరటము తరుముచు వచ్చున్
యని యూహించుచు తానుగ
తనపై జాలిని కురియుట తప్పుర కు(సు)మతీ. 98

(అరటము = కష్టము, తరుము = వెంబడించు, జాలి = దయ, కురియు = వర్షించు)

తనకి ఏదో అన్యాయం, తనకి ఎపుడో ఏదో కష్టం వస్తుంది, అని ఊహిస్తూ తనంతట తానే తనపై జాలి (self pity) కురిపించడం తప్పు.

కం. వీరుల గాథలు విని ని
ర్వీరు డొకం డూహ లందు బీరములస్ హం
వీరుని వలె వర్తించెడి
తీరున నుండ, యనుచరుడు దీమస మంతస్
బో రచిగా మది నెంచుచుఁ
గేరకనే నీరుకార్చుఁ గీలరి, కు(సు)మతీ. 99

(గాథ = చరిత్రము, నిర్వీరుడు = పిఱికివాడు, బీరము = డంబము, హంవీరుడు = శూరుడు, వర్తించు = వ్యవహరించు, తీరు = విధము, దీమసము = ధైర్యము, వోరచి = వ్యర్థము, మది = మనస్సు, ఎంచు = తలఁచు, కేరు = పరిహసించు, నీరుకార్చు = అవరోధాలు కల్పించి నిర్వీర్యం చేయు, కీలరి = మర్మము ఎరిగినవాడు)

క్రీ.శ. 1605వ సంవత్సరంలో సువాంటీజ్ (Cervantes) అన్న ప్రఖ్యాత రచయిత రచించిన డాన్ కహోటి (Don Quixote) అన్న స్పానిష్ (Spanish) నవలలో నాయకుడైన డాన్ కహోటి ఏదో ఆదర్శం కోసం అన్నట్లు ఊహల్లో సాహసాలు చేస్తూ ఉండేవాడు. ఆతడి దగ్గర సాంచో పంజా (Sancho Panza) అనే బంటు ఉండే వాడు. డాన్ కహోటి ఊహల్లో తేలినప్పుడల్లా సాంచో పంజా అతనికి గాలి తీసేసి నేల మీదకి తీసుకొచ్చేవాడు. కొన్ని సినిమాల్లో రావు గోపాల రావు అల్లు రామలింగయ్యల జంట ఇలాగే ఉంటుంది. ఈ స్పానిష్ నవల చాలా భాషల్లోకి తర్జుమా చేయబడి ఆ పాత్రలు ప్రపంచ ప్రఖ్యాత మయ్యాయి. ఎంతగా అంటే, రామాయణంలో మారీచుడి పాత్ర పేరు మీద సాహిత్యంలో "మారీచము" అంటే "మోసము" అన్న అర్థం స్థిరపడినట్లు, ఆంగ్లంలో quixotic, to sanchopanzer అన్న క్రియాపదాలు, quixotification, quixotism, sanchification of Don Quixote, quixotization of Sancho అన్న పదాలు ఆ పాత్రల ప్రవర్తనకి తగ్గట్టుగా పుట్టాయి. ఈ పద్యంలో డాన్ కహోటి ప్రవర్తన గురించే చెప్పబడింది.

వీరుల చరిత్రలు విని ఒక పిఱికివాడు ఊహల్లో డంబాలతో శూరుడి లాగా వ్యవహరించే తీరున ఉండగా, అనుచరుడు అతని ధైర్య మంతా వ్యర్థము అని మనస్సులో అనుకొని పరిహసించకనే నీరుకార్చే మర్మము ఎరిగినవాడు.

కం. భావోద్వేగము స్త్రీలను
యావేశము పురుషు లందు యధికం, బటులే
ధీవరులకు వల విసరు స్వ
భావము సహజము, వెతుకకు భాతిని, కు(సు)మతీ. 100

(ఉద్వేగము = కలఁత నందిన మనస్సు, ఆవేశము = ఉద్రేకము, ధీవరుడు = జాలరి, భాతి = పోలిక)

స్త్రీలల్లో భావోద్వేగము, పురుషుల్లో ఆవేశము ఎక్కువ. అదే విధంగా జాలరులకు వల విసిరే స్వభావం సహజం. పోలిక వెతకద్దు.

కం. కూకటిరత్నము, మాన్యుడు
మా కొడుకను గారము మున్న మాతకు పితకుస్
లేకితన ముట్టి పడు యో
పోకిరి సుతు డౌట మనముఁ గనమే కు(సు)మతీ. 101

(కూకటిరత్నము = తలమానికము, మాన్యుడు = పూజ్యుడు, గారము = గారాబము, లేకితనము = వెకిలితనము, ఉట్టిపడు = స్పష్టంగా తోచు, పోకిరి = దుర్మార్గప్రవర్తనము గలవాఁడు, సుతుడు = కుమారుడు, కను = చూచు)

తలమానికము గౌరవింపదగిన వాడు మా కొడుకని గారాబం చేసే తల్లిదండ్రులకి వెకిలితనం ఉట్టిపడే ఒక పోకిరి కొడుకవ్వడం మనం చూడమా.

కం. అవకాశవాద మంతయు
యవసర మున్నప్పు డెల్ల నాసన్నించుస్,
యవకాశ మరయు యత్నము
నవిరతముగ చేయు చుండు టరుదే కు(సు)మతీ. 102

(అవకాశవాదము = సమయాన్ని గుర్తించి స్వలాభాపేక్షతో పరిస్థితులకు అనుగుణముగా మారిపోవు పద్ధతి, ఆసన్నించు = సమీపించు, అవకాశము = సందర్భము, అరయు = వెదకు, యత్నము = ప్రయత్నము, అవిరతము = ఎల్లప్పుడు, అరుదు = అపురూపము)

అవకాశవాద మంతా అవసర మున్నప్పుడల్లా సమీపిస్తుంది. అవకాశం వెదకే ప్రయత్నం ఎల్లప్పుడు చేస్తూ ఉండటం అరుదే.

కం. దైవము కడ మతగురువుల
చేవాటున మెలఁగ దక్కు స్నేహముల వలస్
ప్లావితమగు పలుకుబడిని
వావిరిగా క్రొత్త తెగలు పనుగొను కు(సు)మతీ. 103

(కడ = సమీపము, చేవాటు = సమీపము, మెలఁగు = సంచరించు, దక్కు = లభించు, ప్లావితము = వ్యాప్తమైనది, పలుకుబడి = ప్రాబల్యము, వావిరి = అధికము, తెగ = వర్గము, పనుగొను = దృఢపడు)

దేవుని దగ్గర (దేవాలయాల్లో) మతగురువుల దగ్గర తిరిగితే ఏర్పడే స్నేహాల వల్ల వ్యాప్తమయ్యే పలుకుబడితో అధికంగా క్రొత్త వర్గాలు గట్టిపడతాయి.

కం. అతి వినయం, బతి ప్రేమయు,
యతి కోపం, బతి సహనము, యతి శాంతంబుస్,

యతి కరుణయు, యతి చొరవయు,
మితి లేకున్న నెవరైన మెచ్చరు కు(సు)మతీ. 104

(అతి = అధికము, వినయము = వినమ్రత, సహనము = ఓర్పు, చొరవ = ఒక కార్య సాధనలో అవతలి వారి అంగీకారంతో నిమిత్తం లేకుండా పూనుకొనే ప్రయత్నం, మితి = హద్దు, మెచ్చు = శ్లాఘించు)

"అతి సర్వత్ర వర్జయేత్" అన్నది ఒక ప్రసిద్ధ సూక్తి. ఏ విషయంలోనైనా అతి, అంటే మితిమీరినట్లుగా ఉండడం ఇబ్బందే. కనుక, దేనినైనా పరిమితికి మించి చేయరాదు అన్నది ఈ పద్యం సారాంశం.

అతి వినయము, అతి ప్రేమ, అతి కోపము, అతి ఓర్పు, అతి శాంతము, అతి దయ, అతి చొరవ - హద్దులు లేకుండా ఉంటే ఎవరూ కూడా మెచ్చుకోరు.

కం. ప్రతివారి కొకటి తెలియును,
యితరులు యే తరుణ మందు యెట్లుండినచో
హితమై యుండెడిదను సం
గతి, తమ వర కొచ్చిన యెఱుకపడదు కు(సు)మతీ. 105

(తరుణము = సమయము, హితము = మేలు, సంగతి = విషయము, ఎఱుకపడు = విదితమగు)

Everybody knows what others might have done. అందరికీ ఒకటి తెలుసు. వేరే వాళ్ళు ఏ సమయంలో ఎలా ఉండి ఉంటే మేలు అయ్యుండేదో అన్న విషయం. తమ దాకా వస్తే మాత్రం తెలియదు.

కం. చెప్పిన విధమునఁ జేయక
గొప్పనుకొని చేయు తప్పు కోరిన నైనం
యొప్పక, యన్యుల నెపుడున్
తిప్పలు పెట్టుటయె తప్పు, తెలియుము కు(సు)మతీ. 106

(ఒప్పు = సమ్మతించు, అన్యులు = ఇతరులు, తిప్పలు = కష్టములు)

చెప్పినట్లుగా చేయకుండా, గొప్ప అనుకొని చేసిన తప్పు కోరినా కూడా ఒప్పుకోక, ఇతరులను ఎప్పుడూ కష్టాలు పెట్టడం తప్పు, తెలుసుకో.

కం. తనకే యెపుడున్ వచ్చున్
ఘనమగు భావంబు లన్న గర్వము తోడన్
చెనకుచు, యన్యుల కవమతి
నొనరించెడి, నడవడి కెట నొప్పును కు(సు)మతీ. 107

(ఘనము = గొప్పతనము, భావము = ఆలోచన, చెనకు = ఎదిరించు, అన్యులు = ఇతరులు, అవమతి = అవమానము, ఒనరించు = చేయు, నడవడిక = ప్రవర్తనము, ఎట = ఎక్కడ, ఒప్పు = ఉచితమగు)

తనకే ఎప్పుడూ గొప్ప ఆలోచనలు వస్తాయన్న గర్వంతో ఎదిరిస్తూ ఇతరులకు అవమానం చేసే ప్రవర్తనము ఎక్కడైనా ఉచితంగా ఉంటుందా?

కం. వృద్ధుల పని యిదియేనా
బుద్ధికి తోచిన వెపుడును బోధించుటయా
వృద్ధికి వీరడ్డ మనుచు
వృద్ధాశ్రమములను యుంచ వినమే కు(సు)మతీ. 108

(వృద్ధులు = ముసలివారు, బుద్ధి = మనస్సు, బోధించు = తెలియజేయు, వృద్ధి = అభివృద్ధి, అడ్డము = ఆటంకము)

ముసలాళ్ళ పని ఇదేనా, మనస్సుకి తోచినవి ఎప్పుడూ బోధించడమేనా, అభివృద్ధికి వీళ్ళు ఆటంక మంటూ వృద్ధాశ్రమాలలో (old age homes) ఉంచడం వినమా.

కం. స్వామి నడుప కున్న కలసి
సామూహిక కృషి సలిపెడి శ్రద్ధాసక్తుల్
శ్రామికులకె యాదర్శము,
చీమలలోఁ గానుపించు చిత్రమె కు(సు)మతీ. 109

(స్వామి = అధికారి, నడుపు = కార్యకలాపాలను నిర్వహించు, కలయు = కూడు, సామూహిక = సమూహంలో కలియువాడు, కృషి = జీవనోపాయము, సలుపు = చేయు, శ్రద్ధ = ఏకాగ్రత, ఆసక్తి = కుతూహలము, శ్రామికుడు = కష్టజీవి, ఆదర్శము = అనుకరింపదగినది, కానుపించు = కనఁబడజేయు, చిత్రము = ఆశ్చర్యము)

Go to the ant, you sluggard; consider its ways and be wise! అన్న చిన్న కవిత / సామెత ఉంది. ఈ పద్యంలోని భావన అదే.

ఒక అధికారియో నాయకుడో నడపక పోయినా కలిసి అందరూ కృషి చేసేటటువంటి శ్రద్ధాసక్తులు, కష్టజీవులకే ఆదర్శము. అది చీమలలో కనిపించడం ఆశ్చర్యమే.

కం. కూరిమిఁ గల దినములలో
నేరము లెన్నఁడు కలుగవు నెయ్యపువారికిన్

కూరిమి లేనపు డోరిమి
నేరిమి పేరిమిఁ గలిగిన నెరవగు కు(సు)మతీ. 110

(కూరిమి = స్నేహము, దినము = రోజు, బేరము = వస్తువు కొనే వెల గురించి అంగీకారం కుదరడం, కుదురు = అనుకూలమగు, బేహారికుడు = వర్తకుడు, ఓరిమి = ఓర్పు, నేరిమి = నేర్పు, పేరిమి = అతిశయము, నెరవు = సహాయము)

స్నేహం ఉన్న రోజులలో వర్తకులలో బేరాలు ఎన్నో కుదురుతాయి. స్నేహం లేనప్పుడు ఓర్పు, నేర్పు, అతిశయం ఉంటే సాయం అవుతుంది.

కం. తన వారి మంచితనమును,
తన మిత్రుల కున్న పండితమమును, ధనముస్,
తన పరిచితుల నడత, యీ
సున తన కొడఁగూఁడ వను టసూయయె, కు(సు)మతీ. 111

(పండితమము = పాండిత్యము, పరిచితుడు = పరిచయము గలవాఁడు, నడత = ప్రవర్తనము, ఈసు = ఈర్ష్య, ఒడఁగూఁడు = సిద్ధించు, అసూయ = ఓర్వలేమి)

తన వాళ్ళలో ఉన్న మంచితనము, తన స్నేహితులకు ఉన్న పాండిత్యము ధనము, తనకు పరిచయం ఉన్న వాళ్ళ ప్రవర్తనము, తనకు సిద్ధించవని ఈర్ష్యతో అనడం ఓర్వలేనితనమే.

కం. నవ్వుట నేర్పిన వచ్చునె
నవ్వుట నవ్వించుటన్న నైజమున యగుస్
నవ్వించు హాస్యచతురత
రవ్వంతగ యున్న వాడె రసికుడు కు(సు)మతీ. 112

(నైజము = స్వాభావికము, చతురత = ప్రావీణ్యము, రవ్వంత = కొంచెము, రసికుడు = సహృదయుడు)

నా చిన్నప్పుడు "రేగు చెట్టు కింద గుడ్డివాడు" అనే నవ్వు తెప్పించే కథ పెద్దవాళ్ళు చెబుతూ ఉండేవారు. పల్లెటూళ్ళలో అది వరకు బహిరంగ ప్రదేశాలలో నాటకాలు ప్రదర్శించేవారు. ఆ ఊళ్ళో ఉన్న ఒక గుడ్డివాడు నేను కూడా నాటకం చూడాలి (వినాలి), తీసుకెళ్ళు అని తన స్నేహితుడి దగ్గర మంకు పట్టు పట్టాడు. అది సరేరా, అందులో జరిగే సన్నివేశాలకి, ఉదాహరణకి హాస్య సన్నివేశాలకి నువ్వు ఎలా స్పందిస్తావు, నీకు కనపడదుగా, అని స్నేహితు డన్నాడు. దానికి ఆ గుడ్డివాడు చెప్పిన ఉపాయం ఏమిటంటే, హాస్య సన్నివేశం వచ్చినప్పుడు నన్ను చిన్నగా గిల్లు, అప్పుడు నేను నవ్వుతాను అని. తీరా, నాటకం మొదలయ్యే సమయానికి ఆ స్నేహితుడికి వేరే పని మీద ఎక్కడకో వెళ్ళాల్సొచ్చింది. అది చెబితే గుడ్డివాడు నొచ్చుకుంటాడని, అతన్ని నాటకం వేసే ప్రదేశానికి తీసికెళ్ళి అక్కడ కాస్త దూరంగా ఒక రేగు చెట్టు కింద కూచోబెట్టి వెళ్ళాడు. రేగు చెట్టుకి ముళ్ళు ఉంటాయి కదా. ఆ కొమ్మలు గాలికి ఊగి గుడ్డివాడికి తగిలినప్పుడల్లా ఏదో ఒక ముల్లు కొద్దిగా గుచ్చుకోవడం వల్ల, అతడు నవ్వడం మొదలు పెట్టాడు. నాటకంలో హాస్య సన్నివేశం కన్నా, అక్కడి ప్రేక్షకులకు ఇదే ఎక్కువ హాస్యంగా అనిపించింది. అలా నవ్వడం గుడ్డివాడికి కృత్రిమం కాకపోయినా, ఇప్పుడు కొన్ని డబ్బు తీసుకుని నేర్పే వ్యాయామాలలో ఊరికే నవ్వడం అనే అంశం చేర్చారు. ఈ పద్యం దాన్ని గురించినదే.

నవ్వడం నేర్పితే వస్తుందా? నవ్వడం నవ్వించడం అంటే స్వాభావికంగా అవుతాయి. నవ్వించే హాస్యరసంలో ప్రావీణ్యము కొంచెము ఉన్నవాడే సహృదయుడు.

కం. నగవను నగఁ గల మనుజుడు
పగలను తగవులను గెలిచి పరగును ఘనుడై
జగమున కొసగ నవ సరణి
యగుపడు సమతయు మమతయు యనిశము కుమతీ. 113

(నగవు = నవ్వు, నగ = ఆభరణము, పగ = విరోధము, తగవు = జగడము, పరగు = ప్రవర్తిల్లు, ఘనుడు = గొప్పవాడు, జగము = ప్రపంచము, ఒసగు = ఇచ్చు, నవ = క్రొత్త, సరణి =

విధానము, అగుపడు = కంటబడు, సమత = సమత్వము, మమత = అభిమానము, అనిశము = ఎల్లప్పుడును)

నవ్వే ఆభరణంగా కలిగిన మానవుడు విరోధాలను కలహాలను గెలిచి గొప్పవాడిగా ప్రవర్తిల్లుతాడు. ప్రపంచానికి క్రొత్త పద్ధతి ఇవ్వడం వల్ల ఎల్లప్పుడు సమత్వము అభిమానము కనబడతాయి.

కం. తన కెవ్వరు లేరండగ
తన పోరొంటరి దటంచు ధర్మము కొర కొ
ప్పనితనముల నెదిరించుచు
మనుగడ సాగించు నరుడె మాన్యుఁడు కు(సు)మతీ. 114

(అండ = ఆసరా, ఒంటరి = అసహాయుఁడైన బంటు, ధర్మము = న్యాయము, ఒప్పనితనము = అపచారము, మనుగడ = జీవనము, నరుడు = మనుష్యుడు, మాన్యుఁడు = పూజ్యుఁడు)

తనకి ఎవ్వరూ అండగా లేరు, తనది ఒంటరి పోరాటం అంటూ న్యాయం కోసం తప్పులని ఎదిరిస్తూ జీవితం సాగించే మనిషే పూజ్యుడు.

కం. నమ్మకు మెవ్వరి నైనను
నమ్మించి కనుమొఱగు దెస నడయాడకుమీ
నమ్మకనే నమ్మితినను
నమ్మిక కలిగించి మనుటె నైపుణి కు(సు)మతీ. 115

(కనుమొఱగు = మోసగించు, దెస = దిక్కు, నడయాడు = సంచరించు, నమ్మిక = నమ్మకము, మను = జీవించు, నైపుణి = నేర్పరితనము)

ఎవరిని పడితే వాళ్ళని నమ్మకు. నమ్మించి మోసగించే దిక్కులో సంచరించకు. నమ్మకుండానే నమ్మాను అని నమ్మకము కలిగించి జీవించడమే నేర్పరితనము.

కం. నిర్వహణ యందు నైపుణి
గర్వము లేకుండ బ్రతుకు గడిపెడి గుణముస్
శర్వరు సతి వంటి సొగసు
పర్వెడు గేహిని దొరకుట భాగ్యమె కు(సు)మతీ. 116

(నిర్వహణ = నెఱవేర్చడం, నైపుణి = నేర్పు, శర్వరుడు = మన్మథుడు, సతి = భార్య, సొగసు = అందము, పర్వు = వ్యక్తమగు, గేహిని = ఇల్లాలు, భాగ్యము = అదృష్టము)

నిర్వహణలో (management) నేర్పు, అహంకారం లేకుండా జీవనం సాగించే గుణం, మన్మథుని భార్యయైన రతీదేవి అందం, వ్యక్తమయ్యే ఇల్లాలు దొరకడం అదృష్టమే.

కం. విని యెవ్వ రేమిఁ జెప్పిన
వినినంతనె మనము నందు విలువలుఁ గలవా
యని తర్కించి యపుడె యౌ
నను వారె యిలను ప్రశంస కర్హులు కు(సు)మతీ. 117

(మనము = మనసు, తర్కించు = విచారముచేయు, ఇల = భూలోకము, ప్రశంస = మెప్పు, అర్హుడు = యోగ్యుడు)

ఎవరేమి చెప్పినా విని, వినంగానే విలువలు ఉన్నాయా లేదా అని మనసులో విచారము చేసి, అప్పుడే ఔను అనే వారే లోకంలో మెప్పు పొందడానికి అర్హులు.



పేరు	:	మద్దాలి వేంకట సత్య రంగనాధం
పుట్టిన తేదీ	:	25-09-1958
జన్మస్థలం	:	చిరువోలు గ్రామం, మోపిదేవి మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్.
విద్యార్హతలు	:	M.Sc; BL
విద్య నభ్యసించిన విద్యా సంస్థలు	:	జిల్లా పరిషత్ హైస్కూలు, మోపిదేవి; శాతవాహన కళాశాల, విజయవాడ; ఆంధ్ర లయోలా కళాశాల, విజయవాడ; ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం; ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఢిల్లీ
వృత్తి / అనుభవం వివరాలు	:	భారతీయ సాంఖ్యక సేవ (Indian Statistical Service) సభ్యునిగా కేంద్ర ప్రభుత్వంలో 36 సంవత్సరాలకు పైగా అనుభవం; సెప్టెంబరు 2018లో డైరెక్టర్ జనరల్ గా సెంట్రల్ స్టాటిస్టిక్స్ ఆఫీసు (Central Statistics Office)లో (ఢిల్లీ) పదవీ విరమణ
ప్రస్తుత వ్యాసంగం	:	తెలుగు సాహిత్యం చదవడం, వ్రాయడం; సమకాలీన సమస్యలు విశ్లేషించి ప్రభుత్వాలకు, అధికారులకు తగిన సూచనలు ఇవ్వడం
కుటుంబ వివరాలు	:	భార్య: కామేశ్వరి; కుమారుడు: భారత్; కుమార్తె: స్వాతి; కోడలు: కోమల్; మనుమరాలు: ఈరా
గత ప్రచురణలు	:	శ్రీరాముని అంతరంగము (Paperback & E-book) in July 2025 దత్తపదుల సమాహారం (E-book) on 12th August 2025 సమస్యాపూరణాల సమాహారం (E-book) on 1st September 2025 నా కవితా ఖండికలు (E-book) on 12th September 2025 నా తెలుగు వ్యాసావళి (E-book) on 18th September 2025 The Collection of Statistics Act, 2008 (E-Book) on 20th December 2025
బ్లాగు వివరాలు	:	https://mvsranganadham.in/

ISBN: 978-93-5937-062-0